నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
వరంగల్
గురువారం అక్టోబర్ 12, 2023 www.navatelangana.com

అసమానతలపై కేవీపీఎస్ నిరంతర పోరాటం



నవతెలంగాణ-పర్వతగిరి

సమాజంలో సామాజిక అసమానతలపై నిరంతరం కుల వివక్షవ్యతిరేక పోరాట సంఘం పోరాటం చేస్తుందని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పోడేటి దయాకర్ అన్నారు. కేవీపీఎస్ 25వ ఆవిర్భవ దినోత్సవ వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో బుధవారం ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ వేల ఏళ్లుగా దళితులు ఓవైపు సామాజిక అణిచివేత మరోవైపు ఆర్థిక దోపిడీకి గురవుతున్నారని అట్టడుగు స్థానంలో జీవిస్తున్న వారి జీవితాల్లో నేటికీ ఆశించిన మార్పు రాలేదని సమాజ అభివృద్ధికి తమ శ్రమను ధారపోస్తున్న వారికి ప్రగతి ప్రగతి వనరుల్లో సహజ సమాన న్యాయాన్ని అందుకోలేకపోతున్నారని ఈ కాలంలోనూ కులవివక్ష అంటరానితనం పల్లెల్లోనూ ప్రత్యక్షంగా, పట్టణాల్లోనూ పరోక్షంగా నిరాటకంగా కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి మాదాసి యాకోబు, సురేష్‌లు పాల్గొన్నారు.

వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ.రంగనాథ్ బదిలీ



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో 13 మంది ఎస్పీలు, ముగ్గురు పోలీసు కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 13 మంది పోలీసు అధికారుల్లో 9 మంది నాన్‌క్యాడర్ అధికారులు ఉండడం గమనార్హం. ఎలక్షన్ కమిషన్ హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్ పోలీసు కమిషనర్లను బదిలీ చేసింది. ఇటీవల ఎన్నికల సంఘం ప్రతినిధి బృందం రాష్ట్రంలో పర్యటించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో పలువురు అధికారుల పోస్టింగ్ పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తాజా ఉత్తర్వులు వెలువడడం చర్చనీయాంశంగా మారింది. బదిలీ అయిన అధికారుల స్థానంలో కొత్త అధికారులను నియమించడానికి ప్యానల్ జాబితాను రూపొందించి పంపాల్సిందిగా ఎన్నికల సంఘం కోరింది.

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

- వరంగల్ తూర్పు ఆర్ఓ, కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా



నవతెలంగాణ-వరంగల్

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులపాత్ర కీలకమైనదని వరంగల్ (తూర్పు) అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, బల్దియా కమీషనర్ షేక్ రిజ్వాన్‌బాషా అన్నారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో వరంగల్ (తూర్పు) అసెంబ్లీ నియోజకవర్గ పరిధికి సంబంధించి సెక్టోరల్ అధికారులతో ఎన్నికల ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడంలో సెక్టోరల్ అధికారుల పాత్ర చాలా కీలకమైనదని, ఒక సెక్టోరల్ అధికారి పరిధిలో 9 పోలింగ్ కేంద్రాలు ఉండేఅవకాశం ఉందని, పోలింగ్ కేంద్రాల్లో వసతులు, పీడబ్ల్యూడీ ఓటర్లకు ర్యాంపుల ఏర్పాటు, నీటి వసతి, ఫర్నిచర్, విద్యుత్, ఫ్యాన్లు, పోలింగ్ కేంద్రంలో ఏవైనా మరమ్మత్తులు ఉన్నట్లయితే వెంటనే పూర్తిచేసి అన్ని వసతులను పరిశీలించి సంబంధిత ఫార్మాట్లో వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలు జరిగే వారం ముందు నుండి సెక్టోరల్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ సిబ్బందిని తీసుకువెళ్లి తిరిగి తీసుకురావడం, ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధం గా చర్యలు తీసుకోవడం, పోలింగ్ కేంద్రాలలో నెలకొన్న సమస్యలపై ఎన్నికల అధికారుల దష్టికి తీసుకువచ్చి పరిష్కరించడం, రిజర్వు ఈవీఎం అందుబాటులో ఉంచుకోవడం, ఎన్నికల రోజున కేటాయించిన రూట్‌పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తహశీల్దార్లు, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి పోలింగ్ కేంద్రంపై పూర్తి అవగాహన కలిగి ఉండా లని తెలిపారు.

ఈ సమావేశంలో ఏసీపీ బోనాల కిషన్, తహశీల్దార్‌లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవ ఏర్పాట్లకై ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ నగరంలోని చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద జరుగుతున్న బతుకమ్మ, దసరా ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయించాలని కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి నాయకులు ఎమ్మెల్యేను కోరారు. ఈమేరకు బుధవారం కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు దూపం సంపత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నరేందర్‌ను కలిసి ఉత్సవాలఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేందర్ బతుకమ్మ, దసరా ఉత్సవాలకు కావల సిన పూర్తి ఏర్పాట్లు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే నరేందర్‌ను కలిసిన వారిలో 19వ డివిజన్ కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్, ఉత్సవ సమితి కన్వీనర్ బయ్య స్వామి ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్ దసరాపరపతి సంఘం ప్రధాన కార్యదర్శి బాంబుల కుమార్, ఆర్టిఏ మెంబర్ గోరంటాల మనోహర్, మాజీ కార్పొరేటర్ బొట్ల సదానందం ప్రతినిధులు గుత్తికొండ నవీన్, ఓం ప్రకాష్ కొలారియా, మార్టిన్ లూథర్, వేములనాగరాజు, కంచ సంపత్, సిద్దోజు శ్రీనివాస్, ఆంజనేయులు, సురేష్, గోపి, సుధాకర్, గంగాధర్, ఇక్బాల్, సంతోష్, ప్రసాద్, హ రి, రమేష్, సురేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం

నవతెలంగాణ-పర్వతగిరి

కాంగ్రెస్‌పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట లో ఘన విజయం సాధించడం ఖాయమని కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు అన్నారు. మండలంలోని చౌటపల్లి, కొంకపాక గ్రామాల్లో జోరుగా ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వస్తే 6పథకాలతో నిరుపేదలకు సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. అలాగే ప్రచారానికి ఏ గ్రామం లోకి వెళ్ళిన బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కుందూరు వెంకట రెడ్డి,మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ లతో పా టు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'పశ్చిమ' కాంగ్రెస్‌లో కస్సుబుస్సు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో హన్మకొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు, నియోజక వర్గ ఇన్‌ఛార్జి, ఇక్కడి నుండి కాంగ్రెస్ పార్టీ టికెట్‌నాశి స్తున్న జంగారాఘవరెడ్డిల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు చోటు చేసుకున్నాయి. రెండుగ్రూపులు కొట్టుకున్న సందర్భాలున్నాయి. ఇదిలావుండగా, ఇప్పటికే ఎవరికివారు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిని ప్రకటించకున్నా ఎవరికివారు కాంగ్రెస్ అభ్యర్థులుగా వాల్‌పేయింటింగ్ పూర్తి చేయడం విస్మయాన్ని కలిగిస్తుంది. దీంతో కేవలం కాంగ్రెస్ పార్టీ శ్రేణులే కాదు.. నగరవాసులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పెద్దమ్మగడ్డలో పోటాపోటీ ప్రచారంలో పాల్గొన్న ఈ ఇద్దరు నేతల అనుచరులు ఘర్షణకు దిగారు. పరస్పరం కేసులు పెట్టుకున్నారు. దీంతో నియోజకవర్గంలోనే కాదు, ఏకంగా ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా వీరి వ్యవహారం చర్చకు దారితీసింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రెండు గ్రూపుల మధ్య నలిగిపోతుంది. హన్మకొండ జిల్లా డిసిసి అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి, పశ్చిమ నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. జనగామ డీసీసీఅధ్యక్షుడిగా వ్యవహరించి గత శాసనసభ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన జంగా రాఘవరెడ్డి తాజాగా పశ్చిమ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో పార్టీ రెండు ముక్కలైంది. ఎవరికివారే పరస్పరం ఆరోపణలు చేసుకుంటుండడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అభ్యర్థిని ప్రకటించకపోయినా ఈ ఇద్దరు నేతలు పార్టీ అభ్యర్థులుగా వాల్ పేయింటింగ్ రాయించుకోవడం చర్చకు దారితీసింది. ఎవరికివారే ఆయా డివిజన్‌లలో పార్టీ ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా పెద్దమ్మగడ్డలో ప్రచారంలో భాగంగా రెండు గ్రూపులు ఎదురెదురవడంతో పరస్పరం దూషించుకుంటూ ఘర్షణకు దిగాయి. ఈ క్రమంలో పరస్పరం ఒకరిపై ఇంకొకరు ఫిర్యాదులు చేసుకోవడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల నేపథ్యంలో మరోమారు 'జంగా','నాయిని'పై తీవ్ర ఆరోపణలు చేశారు.

'నాయిని', 'జంగా'ల కస్సుబుస్సు

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న నాయిని రాజేందర్‌రెడ్డి, జంగా రాఘ వరెడ్డిల మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమంటుంది. హన్మకొండ డీసీసీ అధ్యక్షుడిగా నాయిని రాజేందర్‌రెడ్డి ఎంపికైన సందర్భంలోనే జంగారాఘవరెడ్డి జనగామజిల్లా డీసీసీ అధ్యక్షుడయ్యారు.

- 'నాయిని', 'జంగా' మధ్య పోటాపోటీ

గత శాసనసభ ఎన్నికల్లో పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి 'జంగా' ఓడిపోయారు. గత 7-8 నెలలుగా 'జంగా' వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుండే పోటీ చేస్తానని ప్రకటిస్తూ వస్తున్నారు. ఈక్రమంలోనే ఆయన చాపకింద నీరులా పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూవచ్చారు. దీంతో 'నాయిని' నా అనుమతి లేకుండానే నానియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడని 'జంగా'పై ఫిర్యాదు చేశారు. దీంతో పార్టీఅధిష్టానం, క్రమశిక్షణా సంఘం 'జంగా'ను మందలించింది. ఈ క్రమంలో వెనక్కు తగ్గిన 'జంగా' కొన్నాళ్లకు మళ్లీకార్యక్రమాలను చేయడంప్రారంభించారు. నియోజకవర్గంలోని కాజీపేట ప్రాంతంలో ఆయన అనుచరులిద్దరు కార్పొరేటర్లుగా వుండడంతో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ, ఆకార్యక్రమాలను హన్మకొండ ప్రాంతానికి విస్తరించారు. ఇదే క్రమంలో 'జంగా' ఎమ్మెల్యే వినయ్ కోవర్టు అంటూ 'నాయిని' విమర్శలు గుప్పించిన విషయం విధితమే. దీంతో 'జంగా', 'నాయిని'పై తీవ్ర విమర్శలు చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కొండపల్లి దయాసాగర్ రావుకు వ్యతిరేకంగా 'నాయిని' పనిచేశారని ఆరోపించారు. పరస్పరం వీరిద్దరూ తీవ్రఆరోపణలు చేసుకుంటుండడం పార్టీకి నష్టదాయకంగా పరిణమించింది.

ఎవరు కోవర్ట్..?

'పశ్చిమ' కాంగ్రెస్‌లో ఎవరు కోవర్ట్ ? అన్నది చర్చనీయాంశంగామారింది. కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో కోవర్టుల విషయం పదేపదే తెరపైకి వస్తుంది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 'నాయిని', 'జంగా' పరస్పరం ఇరువురు విమర్శలు, ఆరోపణలు చేసుకుంటూ కాంగ్రెస్ రాజకీయాలను ఎండెక్కించారు. ఎవరు ఎవరికి కోవర్ట్ ? అనేది చర్చనీయాంశంగా మారింది. ఛీఫ్‌విప్ వినయ్‌భాస్కర్‌కు 'జంగా' కోవర్ట్‌గా వ్యవహరిస్తున్నారని 'నాయిని' ఆరోపించిన విషయం విధితమే. తాజాగా నాపై మంత్రి దయాకర్‌రావు, వినయ్‌భాస్కర్‌తో కలిసి నాయిని రాజేందర్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించారని జంగారాఘవరెడ్డి ఆరోపించారు. వీరిద్దరి విమర్శలు, ప్రతి విమర్శలు సగటు కాంగ్రెస్ కార్యకర్తలకు తీవ్ర మనస్తాపాన్ని కలిగిస్తున్నాయి. పార్టీ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకోకుండా ఎవరికివారు వ్యక్తిగత ప్రయోజనాల కోసం చేసుకుంటున్న ఆరోపణలు, విమర్శలలో పార్టీని అభాసుపాలు చేస్తున్నారని సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు.

సహకరించుకుంటారా..?

ప్రత్యామ్నాయం చూసుకుంటారా ..?

'నాయిని', 'జంగా'లలో పార్టీ టికెట్ ఎవరికైనా ఒక్కరికే ఇచ్చే అవకాశముంటుంది. అటువంటి సందర్భంలో పార్టీ శ్రేయస్సును దృష్టిలో వుంచుకొని పరస్పరం సహకరించుకుంటారా ? లేదా ? అన్నది పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ టికెట్ రాకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకుంటారా ? అన్న విషయంలోనూ పరస్పర భిన్నమైన వాదనలు తెరపైకి వస్తున్నాయి. ఏదేమైనా పార్టీ అధిష్టానం 'పశ్చిమ' కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలపై దృష్టి సారించే పరిస్థితిలో లేదు. పార్టీ అభ్యర్థిత్వాలను ఖరారు చేశాకే ఈ వ్యవహారాలపై దృష్టి సారించే అవకాశముంది.

ప్రణాళికబద్ధంగా కౌంటింగ్ ఏర్పాట్లు : కలెక్టర్ ప్రావీణ్య



నవతెలంగాణ-వరంగల్

ప్రణాళికబద్ధంగా కౌంటింగ్ ఏర్పాట్లు జరగాలని వరంగల్ కలెక్టర్, జిల్లాఎన్నికల అధికారి పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 3న అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ జరుగనున్న నేపథ్యంలో వరంగల్ తూర్పు, వర్ధన్న పేట, నర్సంపేట నియోజక వర్గాల కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లు పటిష్టంగా జరగడానికి వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించి తగుసూచనలు చేశారు. ఈ సందర్భంగా డిఈఓ మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా కౌంటింగ్ నిర్వహణకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని, బ్యాలెట్ బాక్స్‌ల భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు, స్ట్రాంగ్ రూమ్‌ల ఎంపిక, ఓట్లలెక్కింపు, అవసరమయ్యే గదులు, వసతులు,బ్యారికెడ్ల ఏర్పాట్ల పై అధికారులకు దిశ నిర్దేశం చేశారు. కలెక్టర్ వెంట డిసిపి రవీందర్, ఇంచార్జ్ డిఆర్ఓ వాసుచంద్ర, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

సొంత గూటికి చేరిన నాయకులు



నవతెలంగాణ-నెక్కొండ రూరల్

మండలంలోని నాగారంకు చెందిన పలువురు టీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారికి నర్సంపేట కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి దొంతి ఆహ్వానించారు. అనంతరం మాధవరెడ్డి మాట్లాడుతూ మాయమాటలు చెప్పి తొమ్మిదేళ్ల గడిపిన అధికార పార్టీకి నవంబర్ 30న అధికార పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను వంద రోజులలో అమలు పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, ఎస్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు లావుడియ తిరుమలచౌహాన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి స్వాగతం పలికారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో నాంపల్లి శ్రీనివాస్, తాళ్లపల్లి సాంబయ్య, రామడుగు రాజు, బోలా యాకన్న, కొక్కరకొండ సురేష్, ఎనగందుల సోమయ్య, నాగారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉప్పుల లక్ష్మణ్, ఎంపీటీసీ రాయపురం భాస్కర్-లక్ష్మి సమ్మెట దేవేందర్, జంగిలి వేణు, రాయపురం విక్రమ్, యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శి బోడ ప్రవీణ్, బానోత్ శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయాన్ని అభివృద్ధి చేసుకోవాలి

నవతెలంగాణ-కాశిబుగ్గ

నగరంలోని ఓసిటీలో కొలువైన కనకదుర్గ ఆలయాన్ని పునరుద్ధరించుకొని అభివృద్ధి చేసుకోవాలని 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన కనకదుర్గ దేవాలయ చైర్మన్ నూకల రాణి డైరెక్టర్స్ గద్దల వేలాద్రి, ఐలోని రాజు, చింతకింది రాజ్ కుమార్, తోట సుమ పూర్ణచందర్ లను బుధవారం కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, జెడ్‌ఆర్‌యుసిసి మెంబర్ చింతాకుల సునీల్ కుమార్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాల్నే సురేష్, డివిజన్ అధ్యక్షుడు యుగంధర్ నాయకులు యాకూబ్, పూర్ణచందర్, రాణి, ధనలక్ష్మి లక్ష్మి, అన్నపూర్ణ, సుధాకర్, శివ, సాగర్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నరేందర్ ను కలిసిన పాలకమండలి

వెంకట్రామ జంక్షన్ సమీపంలోగల కనకదుర్గ దేవాలయం పాలక మండలి చైర్మన్ నూకలరాణి ఆధ్వర్యంలో సభ్యులు బుధవారం ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యే నరేందర్ కు పుష్పగుచ్ఛ అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతాకుల అనిల్, సోమిశెట్టి ప్రవీణ్, బోగి సువర్ణ సురేష్, చింతాకుల సునీల్, గద్దల వేలాద్రి, రాజులు పాల్గొన్నారు.

సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో సినీతార రాశీఖన్నా సందడి

- అంగరంగ వైభవంగా కొనసాగిన ప్రారంభ వేడుకలు







నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

తెలుగు రాష్ట్రాలలో అతిపెద్ద వస్త్ర వ్యాపార సంస్థ సిఎంఆర్, షాపింగ్ మాల్ నయీంనగర్, హన్మకొండలో బుధవారం ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్ రాజుప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ వస్త్ర ప్రపంచంలో రారాజు సిఎంఆర్ హనుమకొండకు రావటం తమకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి సంస్థలు మన హన్మకొండకు రావటం వలన నగరం మరింత అభివద్ధి చెంది, మరిన్ని సంస్థలు వచ్చి వాణిజ్యపరంగా అభివద్ధి చెందుతుందన్నారు. దీనిద్వారా నిరుద్యోగులకు ఉపాది అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. సిఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి వస్త్ర సౌరభం మన హన్మకొండలో లభిస్తుందని ప్రజలు తమకు కావాల్సిన అన్నిరకాల వేడుకలకు సిఎంఆర్ తగు విధంగా అన్ని మోడల్స్ కుటుంబమంతటికీ నచ్చే విధంగా వస్త్రాలు అన్ని వర్గాల ప్రజలకు అతి తక్కువ ధరలకే అందించడం సిఎంఆర్ ప్రత్యేకత అన్నారు. తాను సొంతంగా మగ్గాలపై నేయించిన వస్త్రాలను మార్కెట్లో మరెవ్వరూ ఇవ్వని ధరలకు సిఎంఆర్ లభిస్తున్నాయన్నారు. అనంతరం సిఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ తన 26వ షోరూమును హన్మకొండలో ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. సిఎంఆర్ అంటే "ది వన్ స్టాప్ షాప్" అంటే ఫ్యామిలీలో అందరికీ నచ్చే విధంగా అన్ని రకాల స్టైల్స్, డిజైన్స్ లభిస్తాయన్నారు. తమ వద్ద అన్ని వర్గాలకు అందుబాటు ధరలలో లభించే విధంగా లక్షలలో డిజైన్లు వేలల్లో వెరైటీలు లభిస్తాయన్నారు. సినీతార రాశీఖన్నా సందడి చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అన్ని ఫ్లోర్లు అంతా కలియతిరుగుతూ తనదైన శైలిలో ప్రజలను వినియోగదారులను, అభిమానులను, ఆకట్టుకునే విధంగా హావభావాలతో సందడి చేశారు. అదేవిధంగా మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి తన మిమిక్రీతో వివిధ నటుల డైలాగ్‌లను తనదైన శైలిలో మిమిక్రీ చేస్తూ జనాకర్షణ చేశారు. మున్సిపల్ ఆరవ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు మధుసూదన్, భద్రకాళి అర్చకులు శేషు ప్రధాన అర్చకులు, మొదటి కొనుగోలు ఎస్.రామ్మూర్తి రైస్ మిల్లర్స్ యజమాని బియ్యం ఎగుమతి వ్యాపారి ఫణి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కేఎన్ఆర్‌హెచ్‌యూఎస్ వీసీని సస్పెండ్ చేయాలని నిరసన



నవతెలంగాణ-మట్టెవాడ

ప్రభుత్వం ఇచ్చిన 150 జీవో అమలును తుంగలో తొక్కుతూ రోస్టర్ విధానాన్ని అమలు చేయకుండా సర్వీస్ వైద్యులకు అన్యాయం చేసిన వీసీ కరుణాకర్‌రెడ్డి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ వైద్యులు బుధవారం కాళోజి నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ముందు ధర్నా చేశారు. పీజీ అడ్మిషన్లలో సర్వీస్‌లో ఉన్న వైద్యులకు దక్కాల్సిన అడ్మిషన్లను నాన్‌సర్వీస్ వైద్యులకు అప్ప చెప్పడమే కాకుండా తాముచేసిన విచారణలో తప్పు డు ధ్రువపత్రాలతో పీజీ అడ్మిషన్లను పొందిన ముగ్గు రు వైద్యులపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా వేరే చోటసీట్లు ఇప్పించి అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ వీసీ ఛాంబర్ ముందు ప్రభుత్వ ఐక్య వైద్యుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వవైద్యులు మాట్లాడుతూ పీజీ అడ్మిషన్లలో ఐఎంసీ, తెలంగాణ ప్ర భుత్వం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుకూలంగా కా కుండా కేఎన్ఆర్యూహెచ్ వీసీ కరుణాకర్‌రెడ్డి తన ఇ ష్టానుసారం సీట్లను అమ్ముకున్నారని ఆరోపించారు. రుజువులతో సహా తప్పుడు ధ్రువపత్రాలతో అడ్మిషన్లు పొందిన వారి బాగోతం బట్టబయలు చేసిన వారిపై చర్యలు తీసుకోకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. వీసీ చర్యల వల్ల వెనుకబడిన షెడ్యూల్ తెగల వారికి వైద్యసేవలు అందిస్తున్న సర్వీస్ ప్రభుత్వ వై ద్యులు తీవ్రంగా నష్టపోయారని, రోస్టర్ విధానంలో బీసీ, ఏబిసిడిల అభ్యర్థులకు ఇవ్వకుండా ఓపెన్ కేటగి రిలలో సీట్లను కేటాయించి అర్హులకు అన్యాయం చేశారని అన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి కాళోజి హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌పై చర్యలు తీసుకోవాలని ఈ సం దర్భంగా వారు ప్రభుత్వాన్ని కోరారు.

నవతెలంగాణ 2
సమగ్ర తెలుగు దినపత్రిక
హనుమకొండ
గురువారం అక్టోబర్ 12, 2023 www.navatelangana.com

ఎస్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రమోద్‌కుమార్‌కి డాక్టరేట్



నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం సీఎస్ఈ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోలాడి ప్రమోద్‌కుమార్‌కు డాక్టరేట్ పట్టా పొందినట్లు ఎస్సార్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ డాక్టర్ దీపక్ గార్గ్ తెలిపారు. ఇతను ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ కళాశాల సీబీఐటీ సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ కె.సాగర్ పర్యవేక్షణలో ప్రొఫిసియంట్ న్యూరో ఫజీ గ్రాఫికల్ న్యూరల్ నెట్‌వర్క్ బేస్డ్ వర్టికల్ హ్యాండోవర్ డెసిషన్ మేకింగ్ అల్గోరిథం టు ఎనహన్స్ క్వాలిటీ ఆఫ్ సర్వీస్ ఆన్ ఇంటర్నెట్ ఆఫ్ వెహికిల్స్ ఇన్ 5జీ హెటిరోజినియస్ వైర్‌లెస్‌నెట్‌వర్క్ అను అంశంపై గత ఆరేళ్లుగా పరిశోధనలు చేసి రిపోర్టు సమర్పించినందుకు ఉస్మానియా యూనివర్సిటీ వారు సెప్టెంబర్ 20న పీహెచ్‌డీ పట్టాను ప్రకటించారు. పీహెచ్‌డీ పట్టా పొందిన డాక్టర్ ప్రమోద్‌కుమార్‌ను ఎస్సార్ యూనివర్సిటీ చాన్సలర్ ఎనగందుల వరదారెడ్డి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, యూనివర్సిటీ సెక్రటరీ మధుకర్‌రెడ్డి, డీన్స్, హెడ్స్, అధ్యాపక సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి హామీ పథకం పనిదినాలు పెంచాలి

నవతెలంగాణ-భీమదేవరపల్లి



ఉపాధిహామీ పథకం కూలీలకు పనిదినాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఆజ్మీర బిక్షపతి అన్నారు. మండల వ్యవసాయ కార్మిక సంఘం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు బుధవారం అందజేశారు. ఉపాధిహామీ పథక పని దినాలను 200 రోజులకు పెంచాలన్నారు. వేతనాలు రోజుకు రూ.600లు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఎలుబాక సారయ్య, కమిటీ సభ్యులు సన్నీల కొమురయ్య, గజ్జల కొమరమ్మ, మాడుగుల వేణు, లోకిని సమ్మయ్య, దొండ ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను అణిచివేస్తున్న బీఆర్ఎస్

- ఓబీసీ జిల్లా కో-ఆర్డినేటర్ చిమ్మని దేవరాజు

నవతెలంగాణ-ఆత్మకూర్

గత ఎన్నికల ముందు బీసీలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తామని మాయమాటలు చెప్పిన సిట్టింగ్ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బీసీల ఓట్లతో అందలమెక్కి మోసం చేశాడని ఓబిసి సెల్ జిల్లా కోఆర్డినేటర్ చిమ్మని దేవరాజు మండిపడ్డారు. బుధవారం ఆత్మకూర్ మండలంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందు బీసీ కులస్తులందరికీ అనేక సంక్షేమ పథకాలు అందించి మీ రుణం తీర్చుకుంటామని చెప్పి నేటి వరకు బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి బీసీల ఓట్లతో సీటు లేకుండా చేస్తామన్నారు. ముదిరాజులకు ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా ఇవ్వకుండా అవమానపరిచిన బీఆర్ఎస్‌పార్టీని భూస్థాపితం చేయడమే ముదిరాజుల లక్ష్యంగా పెట్టుకున్నారని, యాదవులకు గొర్లు,బర్లు ఇస్తామంటూ ఓట్లు వేయించుకొని సిట్టింగ్ ఎమ్మెల్యే ముఖం చాటేశారన్నారు. బీసీ లందరికీ బీసీ బందు 10 లక్షలు ఇస్తామని చెప్పి కనీసం ఒక్క లక్ష కూడా ఇవ్వని మోసకారి కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో ఘోరీకడతారన్నారు. ఈ ఎన్నికల్లో ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ చైర్మన్ బయ్య తిరుపతి,ప్రధాన కార్యదర్శి కుక్కల రఘు, గుండెబోయిన శ్యామ్, బిక్షపతి, వెల్దే వెంకటేశ్వర్లు తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారాన్ని చేరవేయాలి : కలెక్టర్



నవతెలంగాణ-సుబేదారి

బుధవారం కలెక్టర్ సిక్త పట్నాయక్ సమీకృత జిల్లా కార్యాలయాల భవనం లోని గ్రీవెన్స్ హాల్ పక్కన గల హాల్ లో జీ36లో ఏర్పాటుచేసిన మీడియా సెంటర్ , మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ)ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమా చారాన్ని ఎప్పటికపుడు మీడియా సెంటర్‌ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయడం జరి గిందన్నారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడి యాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకట నలకు వంటివి సకాలంలో ఆ మోదం మంజూరు చేయాలన్నారు.

షాటిలైట్ ఛానెల్ లో వచ్చే వార్తలను పూర్తి స్థాయిలో రికార్డు చేయాలి అని సూచించారు. వార్తా పత్రికలు, ఈ-పేపర్‌లు, టెలివిజన్ ఛానెల్‌లు, స్థానిక కేబుల్ నెట్‌వర్క్‌లు, సోషల్ మీడియా, మూవీ హాస్‌లు,ఎస్ఎంఎస్‌లు ,ఇతర ఆడియో-వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎం.సీ.ఎం.సీ నుండి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. సోషల్ మీడియా లో వచ్చే పోస్టుల పై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికల ప్రవర్తన నియామవాళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి అని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో లక్ష్మణ్ కుమార్, డిఇ భూపాల్, అరుణ, ఎన్నికల సిబ్బంది, సోషల్ మీడియా సిబ్బంది, జర్నలిస్ట్ లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ ఏర్పాటు

హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ ఫోన్ నంబర్ ను ఏర్పాటు చేశారు. తెలంగాణ శాసనసభ ఎన్నికలు 2023 సందర్భముగా ఎన్నికల సంబంధిత ఫిర్యాదుల కొరకై కంట్రోల్ రూమ్ ,టోల్ ఫ్రీ ఫోన్ నంబరు (1800 425 1816) కలెక్టర్ ఏర్పాటు చేశారు. ఇట్టి టోల్ ఫ్రీ ఫోన్ నంబరు 24 గంటలు చేస్తుందన్నారు.

కావున హనుమకొండ జిల్లా ప్రజానీకము, తెలంగాణా శాసనసభ ఎన్నికలు 2023 సంబంధిత ఫిర్యాదుల కొరకై టోల్ ఫ్రీ ఫోన్ నంబరు (1800 425 1816) సద్వినియోగము చేసుకోనగలరని తెలిపారు.

ఆడపిల్లలను రక్షించాలి, చదివించాలి



నవతెలంగాణ-డెస్క్

ఆడపిల్లలపై వివక్షత వీడి ప్రతి ఒక్కరిని చదివించాలని ఐసిడిఎస్ డిడబ్ల్యుఓ మధురిమ అన్నారు. అంతర్జాతీయా బాలికా దినోత్సవం సందర్భంగా కాజీపేట విష్ణుపురి నార్త్‌అంగన్వాడి సెంటర్లో ఆడపిల్లలను రక్షిద్దాం. ఆడపిల్లను చదివిద్దాం అనే నినాదంతో నేటి సమాజంలో ఆడపిల్లలు ముఖ్యమని అంగన్వాడి సెంటర్ పరిధిలోని తల్లులతో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాధురిమ మాట్లాడుతూ ఆడపిల్లలను పుట్టనివ్వాలని చెప్పు, బేటి బచావో బేటి పడావో నినాదంతో తల్లులచే ప్రతిజ్ఞ చేయించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత, బిఆర్పి స్వర్ణలత, అంగన్వాడి టీచర్లు విజయమంగి, శ్రీదేవి, అంగన్వాడి హెల్పర్ సంగీత, ఆశావర్కర్ స్వరూప, తల్లులు పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవంను పుర స్కరించుకొని బేటీ బచావో భేటీపడావో కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఆడపిల్ల ఉంటేనే ఇంటికికలగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కోమల, హెచ్ఎం సుజాత, అంగన్వాడీ టీచర్లు పద్మజ, శ్రీలత, గర్భిణీలు, కిశోర బాలికలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మూడు టిప్పర్లు పట్టివేత

నవతెలంగాణ-శాయంపేట

వేబిల్లు లేకుండా అక్రమంగా మొరము, కంకర తరలిస్తున్న మూడు ట్రిప్పర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు విజిలెన్స్ అధికారి హరిప్రసాద్ తెలిపారు. మండలంలోని మాందారపేట గుట్టల వద్ద ప్రధాన రహదారిలో బుధవారం వేబిల్లులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు ట్రిప్పర్లను, కంకర తరలిస్తున్న ఒక్క ట్రిప్పరును పట్టుకొని సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. వీటిని మైనింగ్ శాఖకు అప్పగిస్తామని తెలిపారు. దీనిపై మైనింగ్ అధికారులు తగిన చర్య తీసుకుంటారని హరిప్రసాద్ తెలిపారు.

శాయంపేట డిప్యూటీ తహశీల్దార్‌గా ప్రభావతి

నవతెలంగాణ-శాయంపేట

మండల డిప్యూటీ తహశీల్దార్‌గా గన్నబోయిన ప్రభావతి బాధ్యతలు చేపట్టారు. డీటీగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ మహబూబాబాద్‌కు బదిలీపై వెళ్లడంతో ఆయనస్థానంలో ప్రభావతి విధుల్లో చేరారు.

బీసీ ప్రజా సంఘం అధ్యక్షురాలుగా గుంటి స్వప్న

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

హన్మకొండ పోచమ్మకుంట కు చెందినా గుంటీ స్వప్న ను ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలుగా నియమిస్తూ తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట అధ్యక్షుడు నాయిని భరత్ ఉత్తర్వులు జారీ చేసారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలో నిర్వహించిన సమావేశంలో నాయిని భరత్ ఈ ఉత్తరువుల కాపీని గుంటి స్వప్నకు అందించారు. ఈ సందర్భంగా గుంటి స్వప్న మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు పదవి ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్య క్రమంలో సంఘం రాష్ట్ర మహిళా ఇన్చార్జ్ లయన్ డాక్టర్ పద్మజ దేవి బీసీ రాష్ట్ర నాయకులూ శ్రీనివాస, అదేపు నాగేష్, మహిళ నాయకురాలు, దేవిక, శిల్పా, హేమలత తదితరులున్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా కృష్ణ

కాశిబుగ్గ : తెలంగాణ బీసి ప్రజా సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కాశిబుగ్గకు చెందిన గూడూరు కృష్ణ నియమితులయ్యారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా ఇన్చార్జ్ డాక్టర్ పద్మజా దేవి, వరంగల్ ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలు గంటి స్వప్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆడేపు నగేష్, తుమ్మనపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పులుకుర్తిలో బీజేపీ ఇంటింటా ప్రచారం

నవతెలంగాణ-దామెర

దామెర మండలం పులుకుర్తిలో బీజేపీ మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు ఆధ్వర్యంలో గడపగడపకు కరపత్రాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గన్ను సతీష్, సూర చందర్, ఈదునూరి ప్రవీణ్, రాజు, పెంచాల జగన్, బుచ్చిరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మిత్రుల చేయూత

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని చెరువు కొమ్ము తండా గ్రామానికి చెందిన బానోత్ శ్రీనివాస్ ఇటీవల ప్రమాదంలో మృతిచెందడం, శ్రీనివాస్ తండ్రి హరిచంద్ పరిస్థితి ఇంకా విషమంగా ఉండడంతో బాల్య స్నేహితులు కుటుంబ సభ్యులను పరామ ర్శించా రు. మండల కేంద్రంలో 2005-06 ఎస్ఎస్‌సీ బ్యాచ్ శ్రీనివాస్‌తో కలిసి చదువుకున్న బాల్యమిత్రులు తిరుపతి, మురళి, సుమాంజలి, రాధిక, సంతోష్ , సంధ్యరాణి, రమేష్, మమత, గణేష్, రజిత, అనిత, రజిత, రాజు, శ్రీలత, రవిప్రసాద్ , రాధిక, శ్రీను బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు.

మత్స్య కార్మికులకే చేపలు పట్టుకునే అనుమతి ఇవ్వాలి

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని పెద్దకోడపాక రెవెన్యూ శివారులోని మధ్యతరహా చలివాగు ప్రాజెక్టులో మత్స్య కార్మికులకే చేపలు పట్టుకొనుటకు అనుమతి ఇవ్వాలని మత్స్య కార్మికులు సొసైటీపాలక వర్గాన్ని డిమాండ్ చేశారు. పెద్దకొడపాక మత్స్య సొసైటీ చైర్మన్ గండి రాజమౌళి ఇటీవల ప్రాజెక్టులో చేపలు పట్టవద్దని ఆదేశాలను అతిక్రమిస్తే రూ.1 లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు. చెరువుకట్టు విధిస్తున్నామని ఆంక్షలు విధించి మత్స్య కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తుండడంతో బుధవారం 300 మంది మత్స్య కార్మికులు పత్తిపాక-ప్రగతిసింగారం చలివాగు బ్రిడ్జిపై సమావేశం ఏర్పాటు చేసుకొని పలు తీర్మానాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మత్స్య కార్మికుల సంఘం పెద్దలు మోరే రాజయ్య, అల్లం కుమారస్వామి, కుక్కల సుధాకర్, సొసైటీ డైరెక్టర్ పల్లెబోయిన భాస్కర్, కర్ణాకర్, మహేందర్, కుమారస్వామి, పైడి, మల్లేష్ మాట్లాడుతూ పెద్దకోడపాక మత్స్య సొసైటీలో 13 గ్రామాల నుండి 1300కు పైగా సభ్యులు ఉన్నట్లు తెలిపారు. గతంలో చలివా గు ప్రాజెక్టులో చేపల కాంట్రాక్ట్ సిస్టం ఉండగా, మత్స్య కార్మికుల ప్యానల్ గెలిచినప్పటి నుండి కాంట్రాక్ట్ సిస్టం తొలగించి, గత ఏడేళ్లుగా చేపలు పట్టుకుంటూ మత్స్య కార్మికులు జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎన్నికైన చైర్మన్ గండి రాజమౌళి కాంట్రాక్ట్ సిస్టంకు తెరలేపుతూ కార్మికులు ప్రాజెక్టులు చేపలు పట్టవద్దంటూ చేపలు పడితే రూ.1 లక్ష జరిమానా విధిస్తామని, చెరువుకట్టు విధించాలంటూ మత్స్య కా ర్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలిపా రు. కార్మికులు చేపలు పట్టుకొని జీవనం కొనసాగించ డమే తప్ప వేరే పని లేదని, చెరువుకట్టు విధిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని, తమకు చావులే తప్ప మరో గత్యంతరం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రభుత్వం కులవత్తులకు ప్రోత్సాహం ఇస్తుండగా, కొత్తగా ఎంపికైన చైర్మన్ రాజమౌళి ప్రాజెక్టులో పడవలను దింపి వలలను తీసివేస్తానని బెదిరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మత్స్య సొసైటీ పాలకవర్గంతో చర్చించి మత్స్య కార్మికుల పట్ల సానుకూల దక్పథంతో స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కార్మికులు వేడుకున్నారు.

'ఉపాధి'లో మార్పులను వెనక్కి తీసుకోవాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాములు



నవతెలంగాణ-కమలాపూర్

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం పనుల్లో కేంద్రప్రభుత్వం తెచ్చిన మార్పులను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ వ్యవసా య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు అన్నారు. బుధ వారం మండల కేంద్రంలో తహశీల్దార్‌కు తెలంగాణ వ్యవసాయ కార్మిక సం ఘం ఆధ్వర్యంలో అభివృద్ధిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం పనులలో తెచ్చిన మార్పులను వెనక్కితీసుకోవాలని డిమాండ్ చే శారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాలకు ఎన్నికకాబడిన లబ్దిదారులకు తమ యూని ట్లకు కావలసిన ఆర్థికసాయం ఆగిపోతుంది ఏమోనని ప్రజలు భయంతో ఉన్నారని తక్షణమే అధికారులు జోక్యం చేసుకొనిలబ్ధిదారులకు సహాయం అందించా లని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ స్థలాల్లో నిలువ నీడ కో సం గుడిసెలు వేసుకున్న పేదలకు ఇంటి స్థలం, ప ట్టాలు అందజేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కిషన్, ముత్యాల సాంబయ్య, ఒక్కోజు రమాదేవి, మెండు చంద్రమౌళి, బి.రజిత, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆరూరి రమేష్ హ్యాట్రిక్ విజయం సాధించాలని 55 డివిజన్‌లో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



రాష్ట్రంలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఆరూరి రమేష్ భారీ మెజార్టీతో విజయం సాధించాలని కోరుతూ కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ శ్రేణులు బుధవారం 55వ డివిజన్ పరిధిలోని భీమారం శ్రీ వెంకటేశ్వరస్వామి, బొడ్రాయి, భీమా శంకరఆలయం (శివాలయం) , ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అటికం రవీందర్‌గౌడ్, ఎర్రగట్టు గుట్ట దేవస్థాన చైర్మన్ చింతల లక్ష్మణ్, రాయకంటి సురేష్, రాయకంటి సుధా కర్, సంగాల చిన్న, గుంజే సాయికు మార్,గడ్డంభాగ్యలక్ష్మి, బేతెల్లి యాకయ్య, గజాల గోవ పాల్గొన్నారు.

చదువుతోనే సమస్తం సాధ్యం : డీఐఈవో గోపాల్

నవతెలంగాణ-ధర్మసాగర్

చదువుతోనే సమస్తము సాధ్యమని జిల్లా ఇంటర్ విద్యాధికారి అజ్మీరా గోపాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లో జరిగిన ఫ్రెషర్స్‌డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడా రు. అతి తక్కువ కాలంలో కళాశాల సౌకర్యాల కల్పన, విద్యార్థులు వికాసం కోసం ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ చేస్తున్న కృషి రాష్ట్ర వ్యాప్తంగా ప్రేరణగా నిలుస్తుం దన్నారు. శక్తి, సామర్థ్యాలు ఉన్న విద్యార్థి యువతరం కాలంతో పోటీపడి జ్ఞాన సముపార్జన చేయాలన్నారు. ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుతోనే జ్ఞానం సంపద పురోగతి కలుగుతాయని అన్నారు.ఈ స్పహతో రెగ్యులర్ అధ్యాపకులు అదనంగా పని చేస్తూ, కళాశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను, ఉచిత స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నారని అన్నారు. ఇంటర్‌తో పాటు ఉన్నత విద్య అవకాశాల పై అవగాహనను కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు డాక్టర్ రాంధన్, జ్ఞాన సుందరి, వేణుగోపాల్, ఎన్ఎస్ఎస్ అధికారి జ్యోతి, అధ్యాపకులు కనకయ్య, కరుణాకర్, బాబురావు, సదానందం, రాములు, మంజుల, ప్రభాకర్, అజమ్, గణేష్, శ్రీకాంత్ లతో పాటు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



15 నుండి భద్రకాళి బండ్‌పై నవరాత్రి ఉత్సవ మాలిక

నవతెలంగాణ-హన్మకొండ

మన వరంగల్ ఆరోగ్యకరదీపిక శ్రావ్యస్ ఫిట్నెస్ జోన్ ఆధ్వర్యంలో ఈనెల ఈనెల 15 నుండి 23వరకు నవరాత్రి ఉత్సవ మాలిక నిర్వహిస్తున్నామని నిర్వాహకులు స్రవంతి రెడ్డి సంగీత రెడ్డి తదితరులు తెలిపారు. బుధవారం బుధవారం శ్రావ్యాస్ ఫిట్నెస్ జోన్ ఆధ్వర్యంలో వరంగల్ ప్రెస్ క్లబ్ లో మాట్లాడారు. ఈ నెల 15 అక్టోబర్ నుంచి 23 వరకు సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు మన వరంగల్ కీర్తి కిరీటమైన భద్రకాళి ట్యాంక్ బండ్ నందు దాండియా మహెూత్సవం నిర్వహించబడుతోందని కార్యక్రమానికి నగరంలోని అందరూ ఆహ్వానితులేనని ఈ కార్యక్రమం ముఖ్యమైన సూచనలు, బహుమతులు ఈ కింద విధంగా ఉంటాయని తెలిపారు. అత్యుత్తమ డ్రెస్సింగ్/ వస్త్రాలంకరణ బహుమతి, ఉత్తమ దాండియా మరియు నత్యం ప్రదర్శన బహుమతి, అలానే ఎన్నో ఆశ్చర్యకమైన వినోదాత్మకమైన అంశాలు, ఫైర్ జిమ్నాస్టిక్స్ మ్యూజిక్ సాంప్రదాయ మరియు గిరిజన సంగీతం, నత్యాలు, మ్యాజిక్ షోస్, పిల్లలకి పెద్దలకి ఎంతో ఆహ్లాదము మరియు ఆనందం కలిగించే మరి ఎన్నో ప్రదర్శనలు మరియు కార్యక్రమాలతో పాటు ఈ కార్యక్రమంలో భాగంగా 360 డిగ్రీస్ సెల్ఫీ బూత్ ఉంటుందని తెలిపారు. దాండియాలో పాల్గొనేవారు అందరిని వారి వారి దాండియా స్టిక్స్ / కర్రలను తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రవేశం పూర్తిగా ఉచితం అని అన్నారు. ఈ సమావేశంలో శ్రావ్యాస్ ఫిట్నెస్ జోన్ నిర్వాహకులు సంగీత, మాధవి,శ్రీకాంత్, లత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-శాయంపేట

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజా సమస్యలు పరిష్కరించబడి శాయంపేట మండలం అన్ని రంగాలలో అభివద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని గోవిందాపూర్‌లో బుధవారం ఇంటింటికి కాంగ్రెస్ ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రవేశపెట్టే పథకాల గ్యారెంటీ కార్డును ఇంటింటికి వెళ్లి పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న కొంతమంది రైతులు స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి కి సంబంధించిన బాలాజీ రోబో సాండ్ క్రషర్ నుండి వచ్చే దుమ్ము ధూళితో ఆరుగాలం కష్టపడితే వచ్చే పంట తీవ్రంగా నష్టం జరుగుతుందని మమ్మల్ని ఆదుకోవాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో చిందం రవి, సాంబయ్య, కుమారస్వామి, శ్రీనివాస్, రాజకుమార్, రజనీకాంత్, రాజిరెడ్డి, బక్కన్న, బొత్త శ్రావణ్ పాల్గొన్నారు.

నిబంధనలు తూచ్ ....బార్‌లో బాదుడే లక్ష్యం

- కనీసం తాగునీటి సరఫరా కూడా కరువే
- లబోదిబోమంటున్న మద్యం ప్రియులు

నవతెలంగాణ-హసన్‌పర్తి



హనుమాకొండ ఎక్సైజ్ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న బార్‌ల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ మద్యం ప్రియుల నడ్డి విరుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి బార్‌కు వచ్చే వినియోగదారులుకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బార్ నిర్వాహణలు యజమానులు స్వలాభాపేక్షతో వ్యవహరిస్తూ మద్యం ప్రియులపై అధికబారాన్ని మోపుతున్నారన్న ఆరోపణలున్నాయి. పెగ్ సిస్టంపేరుతో నిలువుదోపిడీ చేయడమే కాకుండా కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్న ఆరోపణలున్నాయి. జనతా బార్, ఏసీ, ప్రైవేట్ గదులంటూ ఒక్కో రేటు ఫిక్స్ చేస్తూ కస్టమర్లపై అధిక భారాన్ని మోపుతున్నారని పలువురు బాధితులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఏసీ గదులలో మద్యం సేవించే వారికి కనీసం లూజ్ వాటర్ కూడా ఇవ్వకుండా తాగునీటి బాటిళ్లను కొనుగోలు చేయాలని బేరర్‌లు బాహాటంగానే చెబుతున్నారు. బార్ నిర్వాహకులు ఏసీ చార్జ్, యూజర్ చార్జ్, వెయిటింగ్ చార్జ్, జీఎస్టీ చార్జ్, సర్వీస్ చార్జ్‌లతో పాటు చివరకు టిప్పుల మోతతో మద్యం ప్రియులు తలలు పట్టుకుంటున్నారు. బార్‌లలో ప్రశాంతంగా మద్యం సేవించి కొంత సేద తీర్చుకుందామనకుంటే బార్ నిర్వాహకులు వీరి బలహీనతను సొమ్ము చేసుకుంటూ జేబులకు చిల్లులు పొడిచేందుకు చార్జీల పేరుతో వీర బాదుడుబాదుతున్నారని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాల్సిన ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు మాత్రం అవేమి పట్టనట్లుగా వ్యవహరిస్తూ మద్యం ప్రియులకు జేబులకు చిల్లులు పొడవడమే కాకుండా ప్రభుత్వ ఆదాయానికి గండీ కొడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బార్ ప్రియులను నిలువుదోపిడి చేస్తూ ప్రభుత్వ పన్ను చెల్లింపులకు గండి కొడుతున్న బార్ నిర్వాహకులపై ఎక్సైజ్, కార్పోరేషన్, పన్నుల, వైద్య ఆరోగ్య ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా ఫ్లెక్సీల తొలగింపు

నవతెలంగాణ-శాయంపేట



రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలు కావడంతో అధికారుల ఆదేశాలమేరకు బుధవారం మండల పరిధిలోని గ్రామాలలో ఇంటిగోడలకు వేసిన ఫ్లెక్సీలను, వాల్ రైటింగ్ మల్టీపర్పస్ సిబ్బందితో తొలగించారు. ఇంటిగోడలకు, తలుపులకు అతికించిన రాజకీయ పార్టీల స్టిక్కర్లను తొలగించారు. రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. రాజకీయపార్టీల వాల్ రైటింగ్‌లను పెయింటింగ్ వేసి చెరిపివేశారు. ఎన్నికల కోడ్ ను అధికారులు పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

దామెర : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున మండలం ఎంపీడీవో కాసర్ల రవీందర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్నిగ్రామాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్లు ,గోడల మీద పెయింటింగ్స్‌లను పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బందిచే తొలగిస్తూ ఎన్నికల కోడ్ను ప్రకఢ్బందీగా అమలు చేయడం జరుగుచున్నది.

అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో ప్రచారం

నవతెలంగాణ-పర్వతగిరి



వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం లోని కల్లెడ రావూరులలోఎలాంటి అనుమతులు లేకుండా బుధవారం రాత్రి వేళలో ప్రచారం నిర్వహిస్తున్నా రని పలు పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై వర్ధన్నపేట ఆర్ వో, తహసిల్దార్ విజయ సాగర్ ను వివరణ కోరగాఎవరికి ప్రచార రథాలకు పర్మిషన్ ఇవ్వలేదన్నారు. అనుమతులు లేకుండా ప్రచారాలు నిర్వహిస్తే ఈ సి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి : ఆర్డీవో

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



నియోజక వర్గ పరిధిలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రెవెన్యూ డివిజన్ అధికారి వాసం రామ్మూర్తి కోరారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని పార్టీలు ఎన్నికల నియమావళిని అనుసరించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొత్తగా ఓటరు నమోదుకు నామినేషన్ల స్వీకరణకు పదిరోజులు ముందు వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రచారాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో అనుమతులు పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు అర్జున్, రవీందర్, పార్టీల నాయకులు రాజేష్ నాయక్, కొరుకొప్పుల మధు, అక్కనపల్లి సాయి పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన లయోల విద్యార్థిని

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన లయోలా పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థిని జీ. సోమేశ్వరి మూడవ స్థానంలో నిలిచింది. బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడిన సమావేశంలో అదనపు కలెక్టర్ సుహాసిని, జిల్లా విద్యాశాఖ అధికారి రాము, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి జయంతి, డీసీడీఓ గౌసియా విద్యార్థిని సోమేశ్వరిని ఘనంగా సత్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డైరెక్టర్స్ సత్యనారాయణ, మండల శంకర్, పీఈటీ సుధాకర్, విద్యార్థిని అభినందించారు.

స్టేషన్‌లో గులాబీ జెండా ఎగురవేస్తాం

- బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి

నవతెలంగాణ-రఘునాథపల్లి



కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పనిచేసి నవంబర్ 30వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్‌ఘన్పూర్ స్థానంలో గులాబీ జెండా ఎగురవేయాలని, ప్రజలే నా ఆస్తి... కార్యకర్తలే బలగమని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. బుధవారం రఘునాథపల్లి మండలంలోని బానాజీపేట, ఎల్లారెడ్డిగూడెం, శ్రీమన్నారాయణపురం గ్రామాలలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు కష్టపడి పనిచేయడం వల్ల రెండు సార్లు తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, మూడోసారి కూడా కేసీఆర్ నాయకత్వంలో అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మచ్చలేని రాజకీయ నాయకుడిగా పేరు ఉన్న తనను గెలిపించాలని ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేశారు. రఘునాథపల్లి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందు ఉండే విధంగా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బోళ్ళం అజయ్ మణికంఠ, మాజీ జెడ్పీటీసీ రాష్ట్ర నాయకులు మారుజోడు రాంబాబు, గొరిగే రవి, హుస్సేన్ నాయక్, లక్ష్మయ్య గౌడ్, మల్కాపురం శ్రవణ్ కుమార్, శివప్రసాద్ వడ్లకొండ, రంగు రాంబాబు, మాచర్ల శ్రీనివాస్, హరీష్ గౌడ్, దుబ్బాక ఎంపిటిసి, సర్పంచులు ముఖ్య పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రుణమాఫీ వేయక పోవడం దుర్మార్గమైన చర్య

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



రైతులకు రుణమాఫీ, ఖాతాల్లో డబ్బులు పడినట్టు ఫోన్ మెసేజ్‌ల రూపేనా మాత్రం చూపిస్తూ, ఖాతాల్లో మాత్రం డబ్బులు జమ కాకపోవడం ఏంటని బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు చర్యగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజక వర్గ ఇంచార్జీ సింగపురం ఇందిర అన్నారు. చిల్పూర్ మండల పరిధిలో 7 గ్రామాల రైతులకు ఇటీవల ప్రభుత్వ రుణమాఫీ జమకాలేదని ఆగ్రహించిన రైతులు మల్కాపూర్ బ్యాంకుకు బుధవారం తాళంవేసి నిరసన వ్యక్తం చేశారు. రైతులకు మద్దతుగా నిలిచి బ్యాంకు మేనేజర్‌తో సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ గద్దెనెక్కిన నాటినుంచి నేటి వరకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రుణమాఫీ పేరిట ప్రకటన చేసి, మేసేజులకు పరిమితం చేసి, రైతుల అరిగోస పెడ్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ వైఫల్యం వల్లే రైతులకు అన్యాయం జరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడమే గాకుండా, సబ్సిడీ ద్వారా వ్యవసాయ పనిముట్లు అందించిన ఘనత తమ పార్టీదేనన్నారు. పెరిగిన ఎరువుల ధరలతో రైతులు వారికున్న కాసింత భూముల్ని అమ్ముకుంటున్నారని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగాల సుభాష్ రెడ్డి, మండల అధ్యక్షుడు సురేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు నారాయణ, సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, మల్లారెడ్డి, సాదం గట్టయ్య చలం, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

నవతెలంగాణ-లింగాలఘనపురం



మండల కేంద్రంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో బుధవారం బీఆర్ఎస్, బిజెపి పార్టీలకు చెందిన 50 మంది యువకులు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు జాగిలపురం రమేష్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొల్లూరి శివ, స్థానిక సర్పంచ్ విజేమనోహర్, ఎంపీటీసీ బిక్షపతి, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ నీలం మోహన్, గ్రామ శాఖ అధ్యక్షుడు రాజ రవీందర్ రెడ్డి,మండల ఉపాధ్యక్షుడు పడిదే రాజశేఖర్, వోబీసీ సెల్ జిల్లా నాయకులు బెజ్జం అంజనేయులు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కీసర దిలీప్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బస్వాగాని అనిల్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చిటకొరు సంపత్, సీనియర్ నాయకులు పక్కిరయ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

- జీపీ జేఏసీ జిల్లా చైర్మన్ రాపర్తి రాజు

నవతెలంగాణ-జనగామ



గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 34 రోజుల సమ్మె విరమణ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని గ్రామపంచాయతీ జేఏసీ జిల్లా చైర్మన్ రాపర్తి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్లో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిపిఓ రంగాచారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ 50,000 మంది గ్రామపంచాయతీ కార్మికులతో సమ్మె చేస్తున్న సమయంలో కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేరుస్తామని హామీ ఇచ్చిందన్నారు.కానీ నేటికి నెరవేర్చకపోవడం ప్రభుత్వ ద్రోహంమేనని విమర్శించారు. 34 రోజుల సమ్మె కాలపు వేతనాలను తక్షణమే చెల్లించాలని ఇప్పటికే నెలలు తరబడి పెండింగ్లో ఉన్న వేతనాలను సైతం వెంటనే ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా స్పందించిన డిపిఓ రంగాచారి మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు సమ్మె కాలపు వేతనాలు తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. సమ్మె కాలపు డిమాండ్లపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ, జిల్లా,మండల నాయకులు గుర్రం లాజర్, కుంభం రాజు, గుర్రం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

కలెక్టరేట్ ప్రాంగణంలోని మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెంటర్, ఎన్నికల ఐటీ సెల్‌లను బుధవారం నాడు, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివలింగయ్య పరిశీలించి ఏర్పాట్లను తనిఖీ చేశారు. అనంతరం ఏంసి కమిటీ సభ్యులతో ఎన్నికల నిర్వహణ తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆయనవెంట జిల్లా ఉప ఎన్నికల అధికారిని సుహాసిని, ఎంసి జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్, ఎంసి కమిటీ మెంబర్స్ కన్న పరశురాములు, మణికుమార్, పి.రాజేంద్రప్రసాద్, ఈడీఎం దుర్గారావు తదితరులు ఉన్నారు.



బెల్టు షాపులను నియంత్రించాలి

- అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి
- సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

నవతెలంగాణ-జనగామ



గ్రామాల్లో పుట్టగొడుగుల పుట్టుక వస్తున్న బెల్ట్ షాపులను నియంత్రించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూకు కనుకారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మూకు కనకా రెడ్డి మాట్లాడుతూ జనగామ జిల్లా వ్యాప్తంగా మద్యం మాఫియాను అరికట్టడంలో ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జనగామ జిల్లా కేంద్రంతో పాటు, గ్రామాలలో వైన్ షాపు యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని జిల్లా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో బెల్టుషాపులు విచ్చలవిడిగా ఉండటంవల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు గ్రామాలలో బెల్టు షాపులవాళ్ళు అధిక ధరలకు మద్యాన్ని అమ్ముతూ మద్యం ప్రియుల జేబులు గుల్లా చేస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారనిఅన్నారు. బెల్ట్ షాపులలో మద్యంపై ఎమ్మార్పీ కంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా వైన్ షాప్ యజమానులు సిండికేట్‌గా మారి బెల్ట్ షాపుల దందాను నడిపిస్తుంటే సంబంధిత ఎక్సైజ్ అధికారులు పట్టించుకోక పోవడం సిగ్గుచేటు అన్నారు.బెల్ట్ షాపుల వల్ల గ్రామాల్లో ఉదయం నుండి మొదలుకొని రాత్రి, పగలు తేడా లేకుండా జోరుగా మద్యం అమ్మకాలు కొనసాగుతుండంతో బెల్ట్ షాపుల్లో మద్యం ఏరులై పారుతున్నదని అన్నారు. ఏలాంటి అనుమతులు లేకుండా గ్రామాలలో బెల్టుషాపులు వందల సంఖ్యలో వెలుస్తున్నాయని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సజావుగా జరగాలంటే ముందు గ్రామాలలో బెల్ట్ షాపులను నియంత్రించాలని తెలిపారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు చోద్యం చూస్తున్నారు కానీ, వైన్ షాపు యజమానులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు.గ్రామాల్లో పేదలు, కూలీలు, యువకులు లిక్కర్‌కు అలవాటుపడుతూ మద్యానికి బానిసలై, పనులకు సైతం వెళ్లకుండా నిత్యం మద్యం మత్తులోనే వారి జీవితంగడిచిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం మత్తులో కుటుంబ కలహాలు ఎక్కువై, సంసారాలు బజారున పడుతున్నాయని అన్నారు. ఒక దశలో హత్యలు ఆత్మహత్యలకు దారితీస్తున్నాయని అన్నారు.బెల్ట్ షాపులవల్ల మహిళలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా పోలీసు, రెవిన్యూ, ఎక్సైజ్ అధికారులు నిద్రమత్తు వీడి బెల్ట్ షాపులను నియంత్రించాలని, అలాగేఅధిక ధరలకు విక్రయిస్తున్న బెల్ట్ షాపుల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బెల్ట్ షాపులను కట్టడి చేసి అసెంబ్లీ ఎన్నికలను సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, జనగామ జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, సుంచు విజేందర్, పోతుకునూరి ఉపేందర్, నాయకులు దూసరి నాగరాజు, ధర్మ బిక్షం యాకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చూపు కాంగ్రెస్ వైపే

- కాంగ్రెస్‌లో చేరిన పాలకుర్తి సొసైటీ మాజీ చైర్మన్ రవీందర్ రావు

నవతెలంగాణ-పాలకుర్తి



రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు కాంగ్రెస్ వైపే చూస్తున్నారని పాలకుర్తి నియోజకవర్గం ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. బుధవారం పాలకుర్తి మండలంలోని విసునూరు గ్రామానికి చెందిన పాలకుర్తి సొసైటీ మాజీ చైర్మన్ అడ్డూరి రవీందర్ రావుతో పాటు, బమ్మెర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, బమ్మెర శ్రీ కోదండ రామస్వామి ఆలయ మాజీ పెండొట వెంకటాచారి, నియోజక వర్గంలోని కోడకండ్ల మండలం రామవరం గ్రామానికి చెందిన బిజెపి రాష్ట్ర నాయకులు వెంగల్ రావు,తొర్రూర్ మున్సిపాలిటీ రెండో వార్డ్ కౌన్సిలర్ నరుకంటి గజానంద్, తొర్రూర్ మండలం అమ్మపురం ఎంపీటీసీ-2 ముద్దం విక్రంరెడ్డి, రాయపర్తి మండల బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు పేటి యాదవ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు ఉల్లంగుల నరసయ్య,తొర్రూరు పట్టణ కేంద్రం నుండి యాదవ సంఘం నాయకులు చిన్న కుమార్ యాదవ్‌తో పాటు భారీ సంఖ్యలో సుమారు 200 మంది హైదరాబాద్‌లో ములుగు ఎమ్మెల్యే సీతక్క, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఝాన్సీ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు సైనికునిలాగా పనిచేయాలన్నారు. అధికార పార్టీ భయభ్రాంతులకు గురి చేసిన భయపడవద్దని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిసిసి నాయకులు నిరంజన్ రెడ్డి, రాష్ట్ర సంస్కృతిక శాఖ అధ్యక్షులు చక్రాల రఘు, ఓబిసి రాష్ట్ర కన్వీనర్ పులి గణేష్ గౌడ్, పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ,తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హమ్యా నాయక్, పాలకుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, కోడకండ్ల మండల అధ్యక్షులు సురేష్ నాయక్, తొర్రూరు మండలాధ్యక్షులు సుంచు సంతోష్, తొర్రూరు కార్యనిర్వాహక అధ్యక్షులు మేకల కుమార్, పెద్ద వంగర మండల ముద్దసాని సురేష్, దేవరుప్పుల మండల అధ్యక్షులు పెద్ది కృష్ణ మూర్తి, తొర్రూరు పట్టణ అధ్యక్షులు సోమరాజశేఖర్, జనగామ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జలగం కుమార్, కాంగ్రెస్ నాయకులు, గాదెపాక భాస్కర్, బైకాని ఐలేష్ యాదవ్, పాలకుర్తి పట్టణ అధ్యక్షుడు కమ్మగాని నాగన్న గౌడ్, తిరుమలగిరి గ్రామ సర్పంచ్ బక్క పుల్లయ్య యాదవ్, బైరు భార్గవ్ భార్గవ్, కార్యకర్తలు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించడానికి కృషి చేయాలి

నవతెలంగాణ-గార్ల



బాల్య వివాహాలతో మహిళలలో అనారోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయని చిన్న వయసులోనే జరుగుతున్న బాల్య వివాహాలను నిర్మూలించడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జూనియర్ కళాశాల ఇన్ చార్జ్ ప్రిన్సిపాల్ రఘుబాబు, కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ పౌండేషన్ మండల కమ్యూనిటీ మొబిలైజర్ రమేష్ లు కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ కూతుళ్లకు చిన్న వయసులోనే వివాహాలు చేయడం వలన అనేక అనారోగ్య సమస్యలతో పాటు, కుటుంబ విలువలు పాటించడంలో మనస్పర్ధలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన ఆడపిల్లలకు వివాహాలు చేసేలా తల్లిదండ్రులు దృష్టి సారించాలని, బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సదస్సులో షేర్ ఎన్జీవో కౌన్సిలర్ సుమలత, అధ్యాపకులు ఎ.ప్రసాద్ రావు, వి.రవీందర్, సిహెచ్ సత్యనారాయణ, జి.సోమన్న, టి.నాగేశ్వరరావు, ఆనంద్ కుమార్, జి.సుజాత, ఏ.స్రవంతి, ఎస్.సంధ్య, విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా చేసింది లేదు..? రేపు చేయబోయేది లేదు..?

- పల్లా పట్టభద్రులకు చేసింది శూన్యం
- ప్రజలకు చేసింది మోసం
- జనగామ ఉపాధ్యక్షులు బెజాడి బీరప్ప

నవతెలంగాణ-బచ్చన్నపేట



రెండుసార్లు ఎమ్మెల్సీగా గెలిచిన పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామ ప్రజలకు చేసింది శూన్యం. జనగామ ప్రాంతంలో రెండు టెక్స్టైల్ పార్కులు ఇస్తానని మోసం చేసి ఒక్క టెక్స్టైల్ పార్కును కూడా ఇవ్వలేని ముఖ్యమంత్రి 16వ తేదీన మళ్లీ జనగామ గడ్డమీద కొచ్చి మాయమాటలు చెప్పడానికి ప్రజలను మభ్య పెట్టడానికి కంకణ బద్ధులై ఉన్నారని, జనగామ ప్రాంతంలోని నిరుద్యోగులకు పట్టభద్రులకు ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి ఏ విధమైన అభివృద్ధి ఉపాధి అవకాశాలు ఉద్యోగ అవకాశాలు కల్పించలేకపోవడం సిగ్గుచేటన్నారు. పంట నష్టం జరిగే జనగామ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నష్టపోతే రైతులకు పంట నష్ట పరిహారం ఇంతవరకు అందించలేని బీఆర్ఎస్ నాయకులు జనగామకు చేసేది ఏమీ లేదు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు ఐదేళ్ల నుండి రుణమాఫీ చేస్తానని మాయమాటలు చెప్పి ఇప్పటివరకు రైతులకు రుణమాఫీ చేయలేని చేతగాని ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు. జనగామలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ చేయని పార్టీ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం అని, 30 లక్షల మంది నిరుద్యోగులకు గడచిన మేనిఫెస్టోలో పెట్టిన నిరుద్యోగ భృతి ఇవ్వకపోగా రెండుసార్లు గ్రూప్ వన్ రద్దు కావడానికి చిత్తశుద్ధి లేని చేతకాని టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వమే కారణమని అన్నారు.

ఈ సమావేశంలో మండల అధ్యక్షులు సోమిరెడ్డి, చింతల చంద్రమౌళి, మండల యువమూర్చా అధ్యక్షులు బంగారు మహేష్, రాంబాబు, మల్లేష్, భారతీయ జనతా పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేతి వృత్తి దారులకు విశ్వకర్మ సమ్మాన్ యోజన పథకం

- లేగ రామ్మోహన్ రెడ్డి

నవతెలంగాణ-దేవరుప్పుల

విశ్వకర్మ 16 కులాల చేతివృత్తి దారులతోపాటు కుమ్మరి, నాయి బ్రాహ్మణులు, బుట్టలు అల్లిక, చేపల వలల తయారీ దారులు, వడ్డెర వృత్తి నిర్వాహకులు, చెప్పుల తయారీ దారులు తదితరులకు విశ్వకర్మ యోజన పథకంను వినియోగించుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్ అన్నారు. మండల కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఆయన మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర పార్టీ నియమించిన నియోజకవర్గ స్థాయి కమిటీ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేయడం జరుగుతుంది. ఎంపికైన అభ్యర్థులకు మొదటి విడత 5రోజుల శిక్షణ,2500 రూపాయలు స్టైఫండ్ ఉంటుంది. రెండవ విడత 15 రోజుల శిక్షణ, రూ.7500 రూపాయలు స్టైఫండ్, 5000 రూపాయలు విలువ చేసే వర్క్ కిట్ ఉచితంగా ఇవ్వడంతో పాటు పీఎం మోదీ గ్యారెంటీ కార్డు అందచేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మొదటి విడత ఋణం కింద 1లక్ష రూపాయలు తరువాత రెండో విడత 2లక్షల రూపాయల ఋణం లభిస్తుంది. బీజేపీ నాయకులు ప్రతి గ్రామం నుండి సుమారు 30 నుండి 50 మంది లబ్ధిదారులు ధరఖాస్తు చేయించే విధంగా చొరవ చూపాలని పార్టీ సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చింత సజన్, మండలాధ్యక్షుడు భాగాల నవీన్ రెడ్డి, జనగాం,శక్తి కేంద్రం ఇంచార్జి గుంటి అజయ్, రామగిరి గణేష్, నాగపూరి రమేష్, గోలి పెద్ద ఉప్పల్ రెడ్డి, బస్వ భాస్కర్, ఇల్లందుల భాస్కర్, ఉప్పలయ్య, బండి రాజు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మాజీ సర్పంచ్ మృతి

నవతెలంగాణ-లింగాలఘనపురం



మండలంలోని బండ్ల గూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ముసుకు మల్లారెడ్డి (60) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై దుర్మరణం చెందినట్లు స్థానికులు తెలిపారు. ఇంట్లో నల్ల మోటారు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య పిల్లలు ఉన్నారు.

అనాథ శవానికి ఐదు వేల ఆర్థిక సహాయం

నవతెలంగాణ-లింగాలఘనపురం

బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు, మండల జెడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి అనాథ శవానికి బుధవారం ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో అనాథ శవానికి మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించి జెడ్పీటీసీ మరో మారు మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని నేలపోగుల గ్రామ ఎంపిటిసి గుగ్గిళ్ల నర్సయ్య 1500 రూపాయలు, రిపోర్టర్ కందుల నర్సింగరావు 1000 రూపాయలు సహాయం చేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

మండలం నేలపోగుల గ్రామానికి చెందిన ఆకుల చిన్న సోమయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం నేలపోగుల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వారి కుటుంబాన్ని పరామర్శించి వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని కోరుకుంటూ వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా 100 కేజీల బియ్యం సాంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శి నేలపోగుల ఎంపిటిసి గుగ్గిల్ల నర్సయ్య అందించారు. గ్రామ శాఖ అధ్యక్షులు గైని ప్రవీణ్, ఓబీసీ సెల్ సభ్యులు జోగురాజు గ్రామ కార్యదర్శి గోలనకొండ నాగరాజు, యూత్ గౌరవ అధ్యక్షులు ఆకుల సాయి, ప్రసాద్ యూత్ ఉపాధ్యక్షులు పస్నీర్ అరుణ్, మాజీ యూత్ అధ్యక్షులు ఆవుల హరిష్, కందగట్ల భాస్కర్, గొగు కొమురయ్య కాళీ ఐలయ్య వడ్లకొండ సత్తయ్య, భాస్కర్, శ్రీధర్, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యువతను ఎన్నుకుంటేనే నిజాయితీ పాలన

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

యువతను ఎన్నుకుంటేనే నిజాయితీ పాలన వస్తుందని, రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో జనసేన జెండా ఎగురుతుందని ఆపార్టీ నియోజకవర్గ ఇంచార్జీ గాదె పథ్వి అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో జనసేనపార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికి ఎన్నికల ప్రచారం చేపట్టారు. జనసేనపార్టీ నియోజకవర్గ ప్రజలకు చేసిన సేవలను వివరిస్తూ, జనసేన కరపత్రాలు ఇంటింటికి అందజేశారు. ఎన్నికల్లో స్థానికుడైన తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాజకీయ స్వార్థం కోసం నియోజకవర్గాన్ని కడియం,రాజయ్యలు అభివృద్ధికి దూరం చేసారని ఏద్దేవా చేశారు. ఇద్దరి ఆధిపత్యపోరుతో నియోజకవర్గాన్ని భ్రష్టుపట్టించారని విమర్శించారు. కాంగ్రెసు పార్టీకైతే ఎన్నికలప్పుడే ప్రజలు కావాలన్నారు. యువత మద్దతుతో జనసేన విజయం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మహమ్మద్ రజాక్, పులిగిల్ల సైదులు యాదవ్, మునిగాల పవన్, గాదె వినయ్, పోలె ప్రశాంత్, శెట్టే రాజేష్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

దాతల అన్న ప్రసాద వితరణ

నవతెలంగాణ-జనగామ

లయన్స్ అంతర్జాతీయ సేవా సంస్థ 320ఎఫ్ జిల్లా ఆధ్వర్యంలో జనగామ ఎంసిహెచ్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ 103వ రోజు తక్షణ పూర్వ జిల్లా గవర్నర్, లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ చార్టర్ అధ్యక్షుడు కన్న పరశురాములు జ్యేష్ఠ పుత్రుడు కే.శే. కన్న అశోక్ జయంతి సందర్భంగా కన్నా కుటుంబ సభ్యులు, గాయిని ఆదర్శిని పుట్టిన రోజు సందర్భం పురస్కరించుకొని లయన్స్ క్లబ్ పాలకుర్తి సేవాభారతి ఈ రోజు వితరణ చేసినట్లు కార్యక్రమ నిర్వహణ కోఆర్డినేటర్ జైన రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు మాట్లాడుతూ ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఆసుపత్రిలోని అవసరార్తులకు ఉదయమే అల్పాహారం వితరణ చేయడం అభినందనీయం అని అన్నారు. ఈ కార్ర్యమంలో కార్యక్రమ నిర్వహణ క్లబ్ సూర్య అధ్యక్షుడు రవి నాయక్, సభ్యులు సిహెచ్. రవీందర్ రెడ్డి, నల్ల యాదగిరి, ఈ రోజు వితరణ చేసిన క్లబ్ జనగామ ఆబాద్ అధ్యక్షుడు శ్రీభాష్యం రఘు, కోశాధికారి వి.ప్రవీణ్ సేవా బాధ్యత క్లబ్ జనగామ బి.బాయిజ్ అధ్యక్షుడు లాగిశెట్టి కిశోర్, కార్యదర్శి కన్న శ్రీనివాస్, కె.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలంలోని బండ్లగూడెం గ్రామ మాజీ సర్పంచ్ ముస్కు మల్లారెడ్డి విద్యుత్ షాక్‌తో బుధవారం మరణించారు. వారి పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొల్లూరి నర్సింహులు (శివ కు మార్), ఎంపిటిసి కేమిడి భిక్షపతి, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, జిల్లా నాయకులు బిట్లబాబు, పోరెడ్డి మల్లారెడ్డి,లింగాలఘనపురం సర్పంచ్ విజయమనోహర్, మాజీ పిఏసీఎస్ డైరెక్టర్ నీలం మోహన్,సాదం శ్రీనివాస్, మండల నాయకులు చిర్రా రవీందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి భగుమహర్షి, సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి, కడకంచి రవి, బోయిని నాగరాజు, వేల్పుల అనిల్ ఉన్నారు.

భూపాల్ నాయక్‌తోనే నియోజకవర్గం అభివృద్ధి

నవతెలంగాణ-కురవి

డోర్నకల్ నియోజకవర్గం అభివృద్ధి జరగాలంటే కిసాన్ పరివార్ అధినేత భూపాల్ నాయక్‌కు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చి గెలిపించుకోవాలని కిసాన్ పరివార్ మండల నాయకులు గూగులోత్ భీమా నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కిసాన్ పరివార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ భూపాల్ నాయక్ పంచ సూత్రాలతో తన సొంత ఖర్చులతో నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడుతున్నాడని, నియోజకవర్గం నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్‌కంపెనీ,రైతుల కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, మండల కేంద్రానికి ఒక వైద్యశాల ఏర్పాటు చేయడం కోసం కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. డోర్నకల్ నియోజకవర్గం గడిచిన 30 ఏళ్లలో అభివృద్ధిలో వెనుకబడి ఉందని నియోజకవర్గం అభివృద్ధి జరగాలంటే భూపాల్ నాయక్‌కే సాధ్యపడుతుందని నియోజకవర్గ ప్రజలు భూపాల్ నాయక్‌ని ఆదరించి ఎమ్మెల్యే గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మండల నాయకులు మంగీలాల్ నాయక్ ,విష్ణు నాయక్, అబ్దుల్, భగత్ సింగ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-కురవి



అండర్ 17 రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు మండలంలోని రాజోలు, బలపాల ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు దార్ల సునీల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజోలు పాఠశాల నుండి హైమావతి, మమత, శైలు, చందులు, బాలపాల పాఠశాల నుండి మధు, క్రాంతి, సందీప్, శశి, వర్షిత్‌లు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 13 నుండి 15న జిల్లాలోని తొర్రూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి రబ్బీ పోటీలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాలల ఉపాధ్యాయులు రవికుమార్, దామోదర్ రెడ్డి, వీరభద్రం వీరన్నలు అభినందించారు.

వాలీబాల్ క్రీడలో ప్రతిభను కనబరిచిన బాలికలు

నవతెలంగాణ-గంగారం



మండలంలోని ఆశ్రమ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థులు సెప్టెంబర్ నెలలో 26,27 తేదీలలో ఎస్జీఎఫ్ గూడూర్ జోనల్ స్థాయి వాలీబాల్ క్రీడలలో ప్రతిభ కనబర్చి 17 విభాగంలో ఎం.సంజన, ఈ.వైష్ణవి జే.అంజలి, యు-14 విభాగంలో ఈ.శృతి, బి.సమజైశ్వరి, సిహెచ్.శ్రీవిద్య, ఈ.నికిత చక్కటి ప్రతి కనబరిచి వాలీబాల్ జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల పిడి ఈసం నాగేశ్వరరావు తెలిపారు. తమ పాఠశాల పిల్లలు జిల్లా స్థాయికి ఎంపిక కావడం మాకు ఎంతో గౌరకారం అని హెచ్ఎం యాకలక్ష్మి, ఉపాధ్యాయుల బృందం ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

మిషన్ ఇంద్రధనస్సు సక్రమంగా అమలు చేయాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ అంబరీష



నవతెలంగాణ-మహబూబాబాద్

చిన్నపిల్లలు అందరికీ టీకాలు వేయడం కోసం రూపొందించిన మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయి వైద్య బృందంతో కలిసి జిల్లా వైద్యాధికారి డాక్టర్ అంబరీష తనిఖీ చేశారు. బుధవారం మండలంలోని కంబాలపల్లి, రెడ్యాల గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. అక్టోబర్ 9 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా మూడు నెలల్లోపు, రెండు సంవత్సరాలలోపు టీకాలు వేయని వారికి మళ్లీ టీకాలు వేయాలని, గర్భిణీలకు టీడీ టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ డేవిడ్, డాక్టర్ రాజ్ మార్, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ సుధీర్ నాయక్, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, హెచ్ఓ రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి చట్టాన్ని నీరు గారుస్తున్న కేంద్రం

- జిల్లా అధ్యక్షులు మండ రాజన్న



నవతెలంగాణ-బయ్యారం

ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నీరు గారుస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మండరాజన్న విమర్శించారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ రెండోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం దేశంలో 15 కోట్ల మంది కూలీలకు పని కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని తీసేయాలని అనేక చర్యలు పూనుకున్నారని, చట్ట ప్రకారం రోజుకూలీ 275 రూపాయలు చెల్లించాల్సి ఉండగా తెలంగాణలో మాత్రం 100, 120 రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని ఉపాధి కూలీలకు గిట్టుబాటు కావడంలేదని వారు వాపోయారు. ఈ కార్యక్రమంలో మోహన్, చంటి, రాము, పురుషోత్తం, శీను పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అలాయ్... బలాయ్...

- కలిసి నడుద్దాం... హ్యాట్రిక్ సాధిద్దాం...

నవతెలంగాణ-మహబూబాబాద్

తెలంగాణ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించి మానుకోట పై గులాబీ జెండా ఎగరవేయడంలో భుజం, భుజం కలిపి పని చేసిన ఇద్దరు మిత్రులు మళ్లీ ఒకటయ్యారు. వాళ్లే తెలంగాణ ఉద్యమకారులు తక్కెళ్ళపల్లి రవీందర్రావు ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్. నోటిఫికేషన్ విడుదలైన మరుక్షణమే మానుకోటలో బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ సాధించేందుకు రాజకీయ ఎత్తుగడలు వేయడంలో సిద్ధమయ్యారు. తెలంగాణ ఉద్యమంలో కలిసి పని చేసిన రాజకీయ ఉద్దండులు ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు టిఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ సాధించుకొని మూడోసారి ముచ్చటగా గులాబీ జెండా ఎగరవేయాలని కంకణ బద్ధుడైన ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ రాజకీయ సమీకరణల రచనలో సిద్ధమయ్యారు. మహబూబాబాద్‌లో ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు గృహంలో తమ కుటుంబ సభ్యులు పార్టీ నాయకులతో భేటీ అయ్యారు. రాబోయే ఎన్నికలలో మానుకోట నియోజకవర్గంలో ప్రచార కార్యక్రమాలను రూపొందించుకోవడానికి చర్చించారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై చర్చ పెట్టడానికి సిద్ధమయ్యారు. ప్రధానంగా మునుగోడు నాగార్జునసాగర్ ఎన్నికలలో టిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించడంలో



తనదైన శైలిలో వ్యూహ ప్రతి వ్యూహాలు చేసిన రవీందర్‌రావు సహకారాన్ని ఎమ్మెల్యే శంకర్ నాయక్ అభ్యర్థించారు. మున్సిపాలిటీ, పట్టణ సమస్యలు గ్రామాల్లో శివారు కాలనీలు తండాల పరిస్థితులను ఆకలింపు చేసుకొని భవిష్యత్తులో వాటి రూపురేఖలు మార్చి వేయడానికి ప్రజలకు ఇవ్వాల్సిన హామీలు తీసుకోవాల్సిన చర్యలపై రాజకీయ మ్యానిఫెస్టో తయారు చేయడానికి సిద్ధమవుతున్నారు. అలాగే మహబూబాబాద్ నియోజకవర్గంలో బలమైన ఆర్థిక శక్తిగా ఉన్న వ్యాపారులు, విద్యావంతులు, మేధావులు, డాక్టర్లు, లాయర్లు యువతను ప్రచారంలోకి ఆహ్వానించడం కోసం తీసుకోవాల్సిన చర్యలను కూలంకషంగా చర్చించారు. అయితే గత కొంతకాలంగా వారి ఇద్దరి మధ్య రాజకీయ విభేదాలు మనస్పర్థలు ఉన్న నేపథ్యంలో వాటిని రూపుమాపుకొని భవిష్యత్తులో మరి ఏలాంటి మనస్పర్థలు రాకుండా ఎప్పటికప్పుడు టచ్‌లో ఉండాలని నిర్ణయించారు. నియోజకవర్గంలో ఉన్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవితతో కోఆర్డినేషన్ చేయడానికి ప్రధానంగా నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీని వేయాలని చర్చించినట్లు సమాచారం. ఏది ఏమైనప్పటికీ మూడోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా కెసిఆర్‌ను గెలిపించుకునేందుకు మానుకోటలో నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరవేసి ఎమ్మెల్యే శంకర్ నాయక్ హ్యాట్రిక్ అన్ని వర్గాలను కలుపుకొని పోయి ప్రచార నిర్వహించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో మహబూబాబాద్ ఎమ్మెల్యేగా టికెట్ పొంది కొద్ది రోజుల్లో ప్రచారం నిర్వహించనున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ రవీందర్ రావు తన వంతు సహాయ సహకారాలు కావాలని ఎక్కువ సమయం ఇక్కడే కేటాయించి నా గెలుపుకు సహకరించాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ విజ్ఞప్తి చేయగా వెంటనే స్పందించిన రవీందర్ రావు పార్టీ కోసం నేను కష్టపడి ఎని చేస్తానని హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యే శంకర్ నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎం.డి.ఫరీద్, సీనియర్ నాయకులు మర్నేని వెంకన్న పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్

నవతెలంగాణ-నరసింహులపేట

రైతుకు రుణమాఫీ చేస్తామని లక్ష రూపాయల వరకు ఉన్నటువంటి రైతుల రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఆ రుణాలు జిల్లా లోపల లక్ష పదివేల మంది రైతులు ఉంటే బ్యాంకులో అప్పు తీసుకున్నటు వంటి రైతులకు 42 వేల మంది రైతులకు మాత్రమే లక్ష రూపాయల రుణం మాఫీ చేసి మిగతా డెబ్బై ఆరువేల మంది రైతులకు రుణాలు మాఫీ చేయకుండా మోసం చేసినటువంటి ఈ ప్రభుత్వం 2018 వరకు కటాఫ్ డేటా అని చెప్పి దాన్ని కూడా అమలు చేయనటువంటి ఈ ప్రభుత్వాన్ని గద్దెదించాలి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గునిగంటి మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం చేస్తానన్నటువంటి బేషరతుగా లక్ష రూపాయలు ఉన్నటువంటి రైతులందరికీ రుణమాఫీ చేయాలి, అట్టి డబ్బులను బ్యాంకర్స్ ప్రభుత్వం నుండి రికవరీ చేసుకోవాలి తప్ప రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా చూడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకోవడానికి తప్ప ప్రజల్ని ప్రజాభిప్రాయాన్ని గుర్తించడంలో ఈ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎనగండ్ల సోమిరెడ్డి, సర్పంచ్ దేశ్పాక రవి, ధర్మారపు వీరన్న, శ్రీను, వీరభద్రం, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా హరితహారం మొక్కలు

నవతెలంగాణ-ఇనుగుర్తి



హరితహారం కార్యక్రమంలో భాగంగా గతంలో నాటిన మొక్కలకు పర్యవేక్షణ లేక ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకుండా కాపాడాల్సిన అధికారులే ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ఇనుగుర్తి ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హరితహారం మొక్కలను సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఇనుగుర్తి గ్రామ ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రంలోని వివిధ గ్రామాలలో రోడ్లకు ఇరువైపులా, గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో నాటిన మొక్కలు సైతం ఎండిపోయి దర్శనమిస్తున్నాయంటే మనం అర్థం చేసుకోవాలి ఏమాత్రం వారిపై పర్యవేక్షణ ఉందో...!? నేడు నాటిన మొక్కలను మనం సంరక్షిస్తేనే అవి వృక్షాలుగా మారి మనకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ప్రాణవాయువును అందిస్తాయని, మొక్కలు నాటడమే కాదు వాటిని సంరక్షించే బాధ్యత సైతం తీసుకోవాలని, వాటి రక్షణ కోసం ప్రభుత్వం ప్రతి ఏటా బడ్జెట్లో నిధులు కేటాయిస్తున్న విషయం మనందరికీ తెలిసిందే. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇనుగుర్తి మండల శివారులోని బెడూ చెరువు నుంచి బంగారు కత్వ చెరువు, గుంటి చెరువు వరకు రోడ్డుకి ఇరువైపులా నాటిన హరితహారం మొక్కలు ఎండి పోయి దర్శనమిస్తున్నాయని, వెంటనే వాటికి సరైన సమయాల్లో నీటిని పోసి రక్షణ జాలీలు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు, ప్రయాణికులు సైతం అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు హై స్కూల్ విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ఇనుగుర్తి



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడా పోటీలలో చిన్న ముప్పారం జెడ్పీ హెచ్ఎస్ స్కూల్‌కు చెందిన మార్గం హరీష్ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటి బిక్షపతి బుధవారం తెలిపారు. ఈ నెల 3న మహబూబాబాద్ జిల్లాలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన అండర్-17 బాలుర రగ్బీ విభాగంలో ఎస్‌జిఎఫ్ ఉమ్మడి జిల్లా సెలక్షన్స్ నిర్వహించగా ఇనుగుర్తి మండలంలోని జెడ్పీ హెచ్ఎస్ చిన్న ముప్పారం పదవ తరగతి విద్యార్థి మార్గం హరీష్ అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి రగ్బీ క్రీడలు ఈనెల 13,14,15 తేదీలలో తొర్రూరులో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ వేణుగోపాల్ రెడ్డి, బి.రవీందర్, ఏ.రమేష్, పి.సత్యనారాయణ, కుమారస్వామి, కే.సోమయ్య, జి.విజయ్ కుమార్, కే.నరేష్, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

క్రీడలు పండుగ వాతావరణం సృష్టిస్తాయి

- డీఈ మధుసూదన్

నవతెలంగాణ-తొర్రూరు



క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటుగా స్నేహపూరితమైన పండుగ వాతావరణంను సృష్టిస్తాయని విద్యుత్ శాఖ డిఈ మధుసూదన్ అన్నారు. బుధవారం ఎంప్లాయిస్ వాలీబాల్ అసోసియేషన్ తొర్రూర్ ఆధ్వర్యంలో స్థానిక తొర్రూరు హై స్కూల్‌లో నిర్వహిస్తున్న దసరా కప్ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో ఆటలు ఒక భాగం కావాలని అప్పుడే ఆరోగ్యవంతమైన శరీరం తయారవుతుందన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షులు గొడిశాల నగేష్ మాట్లాడుతూ రాబోయే కాలంలో ఈ క్రీడను మరింత బలోపేతం చేస్తూ జిల్లా స్థాయిలో కూడా టోర్నమెంట్ నిర్వహించే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ వాలీబాల్ అసోసియేషన్ తొర్రూర్ ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి ఫణీంద్ర, సమన్వయకర్తలు రాయిపెల్లి యాకయ్య, ఉడుగుల మధుకర్, వివిధ టీమ్‌ల ఆటగాళ్లు సంతోష్, కొమ్మనబోయిన వెంకన్న, రఘు, రంజాన్, ఆడేపు రవి కుమార్, జోగు వెంకన్న, గుర్రం వెంకన్న, లింగరాజు, విజయ్, నవీన్, నాగరాజు, కొండం జనార్ధన్, మురళి, లింగమూర్తి, దర్గా హుస్సేన్, రవి, వెంకటరెడ్డి, జాఫర్ అలీ, యాక సాయి, సురేష్, వెంకటేశ్వర్లు, ఎంపైర్లు చెడుపాక ఐలయ్య, గండి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం

నవతెలంగాణ-పాలకుర్తి

నాటు సారా తరలించడంతో పాటు బెల్లం పట్టికను తరలిస్తూ పట్టుబడిన మూడు వాహనాలను మండల కేంద్రంలో గల ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో నేడు వేలం వేస్తున్నట్లు సీఐ బి.సంతోష్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నాటు సారాతో పాటు నల్ల బెల్లాన్ని తరలిస్తున్న వాహనాలను గత కొన్ని నెలల క్రితం పట్టుకొని సీజ్ చేశామని తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలతో పాటు ఒక ఆటో రిక్షా ఉందని అన్నారు. వాహనాల వేలంలో పాల్గొనే వారు ఉదయం 11 గంటలకు ప్రొహిబిషన్ ఎక్సైజ్ పాలకుర్తి కార్యాలయానికి హాజరు కావాలని సీఐ సంతోష్ రెడ్డి కోరారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-చిన్నగూడూరు



మండల కేంద్రంలోని సమర్థ విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ కోలాటాలతో విద్యార్థులు స్థానికులను అలరించారు. కరస్పాండెంట్ శ్రీను బతుకమ్మ యొక్క సంస్కృతి, సాంప్రదాయల విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టం అమలులో వైఫల్యం

- వ్యాకాస నాయకులు కుర్ర మహేష్

నవతెలంగాణ-మహబూబాబాద్

గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చట్టాన్ని నీరుగార్చి కోట్లాదిమందిని పనికి దూరం చేసి పేదల నోట్లో మట్టి కొట్టే నూతన ఏబీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా నాయకులు కుర్ర మహేష్ డిమాండ్ చేశారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వారి సంఘం కార్యాలయంలో నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ అనురాధకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి ఐదు లక్షలకు పైగా ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ది పొందుతుంటే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం ద్వారా ఆధార్ అనుసంధానంతో నేటికీ 42 లక్షల మంది అనుసంధానం చేసుకోలేదన్నారు. ఇప్పటికే వ్యవసాయంలో కూలీ పనులు దొరకక యంత్రాల రాకతో గ్రామీణ పేదలకు పనులు కరువైనయని తెలిపారు. ఉపాధి నిధులు పెంచి పనులు కల్పించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధిలో నూతన విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చేపూరి గణేష్, పట్టణ అధ్యక్షులు తేలూరి వీరభద్రం, సుధాకర్, స్పందన, ఉప్పలయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.



యూటీఎఫ్ నేత నారాయణ సేవలు చిరస్మరణీయం

- రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి

నవతెలంగాణ-మహబూబాబాద్

టీఎస్ యూటీఎఫ్ అగ్ర నాయకులు అమరజీవి నారాయణ సేవలు ప్రశంసనీయమని విద్యారంగంలో ఆయన చేసిన కృషి శ్లాఘనీయమని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి ఎస్.మల్లారెడ్డి అన్నారు. బుధవారం టియస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ అధ్వర్యంలో నారాయణ ప్రథమ వర్ధంతి సభను స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించగా ఎస్.మల్లారెడ్డి నారాయణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ యూటీఎఫ్ మొదటి తరం నాయకుల ఉద్యమ జీవితాన్ని, స్ఫూర్తిని పుణికి పుచ్చుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జేఏసి కో-చైర్మన్‌గా సుదీర్ఘ కాలం పని చేసి ప్రభుత్వ ఉపాధ్యాయ, విద్యారంగంలో చారిత్రక పోరాటాలు చేసి ఎన్నో సమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర ఉందన్నారు. స్పెషల్ విద్యావాలంటీర్లను ఉపాధ్యాయులుగా గుర్తింపు సాధించడంలో పట్టుదలతో అప్రెంటిస్ పీరియడ్‌కు రెండు నోషనల్ ఇంక్రిమెంట్‌లు, తొమ్మిదవ పిఆర్సిలో మెరుగైన ఫిట్మెంట్, ఉపాధ్యాయులకు గౌరవ ప్రదమైన వేతానాలుండేటట్లు పీఆర్సీ స్కేల్స్‌ను రూపొందించడంలో తనదైన శైలిలో పోరాట పటిమను ప్రదర్శించిన పోరాట యోధుడన్నారు. నారాయణ ఆశయ సాధనలో నేటి తరం ఉపాధ్యాయులు పోరాటాలలో స్ఫూర్తినీ కనబర్చినప్పుడే హక్కులు నిలుపుకున్న వారమవుతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్, జిల్లా కార్యదర్శి డి.హుస్సేన్, సీనియర్ నాయకులు ఏ.వెంకటేశ్వర్లు, మహబూబాబాద్, కురవి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సంజీవ, కే. శ్రీనివాస్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బి.హరినాయక్, యు.సురేష్, సభ్యులు కృష్ణమూర్తి, మైసయ్య, లక్ష్మయ్య, రాంజీ, బాబు, రవీందర్, వీరభద్రమ్, ప్రసాద్, తిరుపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మండలాధ్యక్షులు వ్యవహారశైలి మార్చుకోవాలి


నవతెలంగాణ-బయ్యారం



మండలంలో స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియకుండా పార్టీ కార్యక్రమాలు నిర్వహణ అధ్యక్షుడి తీరు వల్ల పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని ఎంపిటిసి, మండల ప్రచార కార్యదర్శి మోహన్ జీ, జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ రాము నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమన్వయంతో చేయకపోతే కాంగ్రెస్‌లో ఇబ్బందులు వస్తాయి కాబట్టి రామచంద్రపురం గ్రామ శాఖ అధ్యక్షులు దూదిమెట్ల మోహన్‌రావు 2019 ఎంపీటీసీ ఎన్నికల నుండి పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎన్నో కార్యక్రమాలతో పాటు కరోనా టైంలో కూడా పార్టీ ఆదేశించిన కార్యక్రమాలు చేస్తూ గ్రామాలలో కాంగ్రెస్ బలోపేతం చేస్తున్న నాయకుడని, అలాంటి నాయకున్ని గ్రామ శాఖ అధ్యక్షుని మార్చడం సరైంది కాదని కాబట్టి మండల అధ్యక్షులు మరొకసారి ఇలాంటి పునఃరావృతం కాకుండా ఉండాలని కోరారు. మాజీ మండల అధ్యక్షులు ప్రజాప్రతినిధులు అన్ని కుల సంఘాల నాయకులు మండల అధ్యక్షుడు మీద చర్య తప్పదని హెచ్చరించారు. అలాగే పాత గ్రామ శాఖ అధ్యక్షుడు దూదిమెట్ల మోహన్రావు కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా మండల అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, సర్పంచ్ కారం భాస్కర్, తమ్మిశెట్టి రాందాస్, ఇస్లాపురం సర్పంచ్ యాప రామకృష్ణ, బానోత్ సుధాకర్, కృష్ణ, రామకోటి, మాజీ ఎంపిటిసి జన్నారపు, భాస్కరరావు, ఉపాధ్యక్షుడు చింత లక్ష్మీనారాయణ, నదునూరి లింగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా పూర్ణచందర్

నవతెలంగాణ-పెద్దవంగర



కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా పెద్దవంగర మండల కేంద్రానికి చెందిన ముత్యాల పూర్ణచందర్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. మహబూబాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ తన సేవలను గుర్తించిన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారని చెప్పారు. తన నియామకానికి సహకరించిన డీసీసీ అధ్యక్షుడు, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధికారమే లక్ష్యంగా తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.



ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా అమలు చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ కె.శశాంక

నవతెలంగాణ-మహబూబాబాద్

ఎన్నికల ప్రవర్తన నియమాలని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె.శశాంక ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్‌తో కలిసి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు జరిగే విధంగా జిల్లా అధికారులు చూడాలని అన్నారు. ఎటువంటి సందేహాలున్న నివృత్తి చేసుకోవాలని ప్రతి మండల, డివిజన్, గ్రామపంచాయితీల భవనాలలో ఇంకా ఏమైనా ఫోటోలు, క్యాలెండర్, స్టిక్కర్స్ ఉంటే తీసివేయాలని, ప్రతీ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించి రాజకీయ పార్టీల ఫోటోలు లేకుండా చూసుకోవాలని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పై ప్రభుత్వ కార్యాలయాలలో క్రింది స్థాయి సిబ్బందికి అవగాహన కలిగించాలన్నారు. ఎలక్షన్ కోడ్ అమలుకు ముందు సాంక్షన్ అయి ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేసే విధంగా చూడాలని ఇంకా కొత్తగా సాంక్షన్ పనులకు పర్మిషన్ ఇవ్వవద్దని అన్నారు. ఎటువంటి అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నియమాకాలు చేపట్టవద్దని కలెక్టర్ తెలిపారు. ప్రజావసరాలకు వాడే వాహనాల విషయంలో కోడ్ అమలును అధికారులు చూడాలని సూచించారు. కార్యాలయాల్లో ఓటర్ ఆవేర్నెస్ ఫోరం తయారు చేసుకోవాలని, ప్రతి ఒక్క జిల్లా అధికారి తమ కార్యాలయాలలో సిబ్బందితో ఓటర్ యాప్‌లో తమ పేరును ఉన్నది లేనిది నిర్ధారించుకునేలా చూడాలన్నారు. రెండు నియోజక వర్గాల్లో ఓటర్లు ఉన్నారు. పోలింగ్ సిబ్బంది కొరకు కేపబులిటీని బట్టి సిబ్బందిని నియమించుకోవడం జరుగుతుందని అందులో ఎటువంటి మినహాయింపు ఉండదని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ రమాదేవి, ఆర్ అండ్ బి ఈఈ తానేశ్వర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలకు సహకరించండి

- ఎస్పీ చంద్రమోహన్

నవతెలంగాణ-మహబూబాబాద్



ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా వ్యాప్తంగా బస్సులు రైలు ప్రైవేటు వాహనాలలో పోలీసులు నిర్వహించే ఆకస్మిక తనిఖీలకు ప్రజలు సహకరించాలని ఎస్పీ చంద్రమోహన్ కోరారు. బుధవారం జిల్లా ఎస్పీ చంద్రమోహన్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ పరిసరాలు రైళ్లలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండటం వల్ల అక్రమ రవాణాలను గుర్తించడానికి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా పరిధిలో మొత్తం 11 చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మద్యం నగదు, రవాణా అయ్యే అవకాశాలు ఉన్నందున మహబూబాబాద్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీచేపడుతున్నారు. నగదు, బంగారం, ఏలాంటి విలువైన వస్తువులు అయినా సరే సంబంధిత ధ్రువపత్రాలు లేకుండా రవాణా చేయవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ డబ్బులు

- కారులో ఐదు, బస్సులో మూడు లక్షలు స్వాధీనం

నవతెలంగాణ-తొర్రూరు



తొర్రూరు పట్టణంలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా బుధవారం తనిఖీలు నిర్వహిస్తుండగా బస్సులో వెళుతున్న వ్యక్తి నుండి 3 లక్షల రూపాయలు, కారును తనిఖీ చేయగా 5 లక్షల రూపాయలు ఏలాంటి ఆధారాలు లేకుండా తీసుకు వెళుతున్న ఈ 8 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై జగదీష్ తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు భీభత్సం

ఒకరు దుర్మరణం, రెండు గేదెలు మృతి

నవతెలంగాణ-పెద్దవంగర



మండలంలో ఆర్టీసీ బస్సు భీభత్సం సృష్టించింది. మండల పరిధిలోని కిష్టు తండా సమీపంలో బుధవారం రాత్రి తొర్రూరు డిపో కు చెందిన ఆర్టీసీ బస్సు గేదెల మీదికి దూసుకెళ్లింది. దీంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. తండాకు చెందిన జాటోత్ జేతిరాం నాయక్ (52) తన గేదెలను ఇంటికి కొట్టుకు వస్తుండగా జగద్గిరిగుట్ట నుండి డిపో వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో జేతిరాంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడు తనకున్న కొద్దిపాటి పొలం సాగు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

కాంగ్రెస్ పార్టీలోకి పాలకుర్తి నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నాయకులు బుధవారం ములుగు ఎమ్మెల్యే సీతక్క, కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గం నాయకురాలు అనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. చేరిన వారిలో కొడకండ్లకు చెందిన బిజెపి రాష్ట్ర నాయకులు వెంగళరావు, తొర్రూరు మున్సిపాలిటీ ఎనిమిదో వార్డు కౌన్సిలర్ కోటి గజానంద, మండల అమ్మపురం ఎంపిటిసి ముద్దం విక్రమ్ రెడ్డి, పాలకుర్తి టిఆర్ఎస్ సీనియర్ నాయకులు అట్లూరి రవీందర్ రావు, రాయపర్తి మండల బిజెపి రాష్ట్ర నాయకులు యాదవ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ నుండి ఉల్లంగుల నరసయ్య, బొమ్మెర పోతన దేవస్థాన కమిటీ చైర్మన్ రవీందర్ రావు, తొర్రూర్ పట్టణ కేంద్రం నుండి యాదవ సంఘం నాయకులు భారీ సంఖ్యలో 200 మంది హైదరాబాదులో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు కోసం ఒక సైనికుని లాగా పనిచేయాలన్నారు. అధికార పార్టీ భయ భ్రాంతులకు గురి చేసిన బయపడవొద్దు అని, మీకు అండగా మేము ఉన్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి నాయకులు నిరంజన్ రెడ్డి, పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హమ్యా నాయక్, కోడకండ్ల మండల అధ్యక్షులు సురేష్ నాయక్, తొర్రూరు మండల అధ్యక్షులు సుంచు సంతోష్, తొర్రూరు కార్యనిర్వాహక అధ్యక్షులు మేకల కుమార్, పెద్ద వంగర మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్, దేవరుప్పల మండల అధ్యక్షులు పెద్ది కృష్ణమూర్తి, పాలకుర్తి మండల అధ్యక్షులు గిరగాని కుమార స్వామి, తొర్రూరు పట్టణ అధ్యక్షులు సోమరాజశేఖర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గుడుంబా పట్టివేత.. మహిళలపై కేసు

నవతెలంగాణ-గోవిందరావుపేట



ప్రభుత్వ నిషేధిత మత్తుపదార్థమైన గుడుంబాతయారు చేస్తూ విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు పస్రా పోలిస్ స్టేషన్ ఎస్ఐ షేక్ మస్తాన్ బుధవారం తెలిపారు. సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో నమ్మదగిన సమాచారం మేరకు పాపాయిపల్లి గ్రామంలో తనిఖీ చేపట్టగా ధరమ్సోత్ స్వాతి గుడుంబాను తయారు చేయడమే కాకుండా విక్రయిస్తూ పట్టుబడింది. పది లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని స్వాతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

నవతెలంగాణ-మల్హర్ రావు



మండల కేంద్రంలో బుధవారం సమాచారం హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిత్యం మహిళలపై ఎదో ఒక రూపంలో దాడులు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. ఇంటా బయటా అనేక ఆంక్షలు ఉం టాయని, ఆడపిల్లల జీవించే హక్కులను మగపిల్లల జీవించే హక్కు లాగా గౌరవించట్లేదని అన్నారు. భ్రూణహత్యలు పెరిగాయన్నారు. అమ్మాయిలకి సురక్షితంగా ఉండే వాతవరణం ఉండి, చక్కని చదువు ఉండి, ఆరోగ్యకరమైన జీవితం గడపగలిగే అవకాశం ఉంటే వారు తల్లులుగా, వ్యాపార వేత్తలుగా, గృహిణులుగా, రాజకీయ నేతలుగా ఎదిగి దిశానిర్దేశం చేయగలుగుతారన్నారు.

ఉల్లం'ఘనుల'పై నిఘా....

- పార్టీల ఫ్లెక్సీలు, ప్రచార బోర్డులు తొలగింపు
- ఎన్నికల నియామవళి అమలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

నవతెలంగాణ-మల్హర్‌రావు

ఎన్నికల నిబంధనల అమలుపై ఈసి ప్రత్యేక దష్టి సారించింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఆయా పార్టీలపై నిఘా పెట్టింది. ఇప్పటికే అధికార యంత్రాంగం నుంచి రోజువారిగా నివేదికలు సేకరిస్తోంది. ఈ మేరకు నిఘా వర్గాలు కోడ్ ఉల్లంఘనలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. దీంతో ప్రచారంలో అభ్యర్థులు వ్యవ హరించే తీరు, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు, ధన ప్రభావం వంటి విషయాలపై పూర్తి సమాచారాన్ని సేక రిస్తున్నాయి. ఎన్నికల నిబంధనల మేరకు ప్రభుత్వ పథకాల ప్రచారం పూర్తిగా నిలిపివేయాలని, ప్రభుత్వ పథకాల పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో గోడలపై పోస్టర్లు, రాతలు, ఫ్లెక్సీలు తొలగిస్తు న్నారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన 24 గంట ల్లోగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫొటోలు, పోస్టర్లు,ఫ్లెక్సీలు తొలగించాలి. 48 గంటల్లోగా అన్ని పబ్లిక్ స్థలాల్లో, 74 గంటల్లోగా అన్ని ప్రయివేటు స్థలాల్లో ఉన్న పోస్టర్లు,ఫ్లెక్సీలు తొలగించాల్సి ఉంటుంది. ఈ మేరకు జిల్లా, మండల వ్యాప్తంగా ఉన్న ఫ్లెక్సీలు, పోస్టర్లు, వాల్ రాతలు తొలగించేందుకు అధికా రులు ముమ్మరం చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల తర పున వారి కుటుంబ సభ్యులు, ప్రధాన అనుచరులు ప్రచా రంలో దిగారు. కానీ అభ్యర్థులు ఇంకా ప్రచారంలోకి దిగ లేదు. సామాజిక సేవా కార్యక్రమాల పేరిట అభ్యర్థులు నిర్వహించే కార్యక్రమాలు, రహస్య సమావేశాలు, ధన, మందు ప్రభావంపై ఎన్నికల అధికారులు దష్టి సారిం చారు. సామాజిక మాధ్యమాల్లో పెట్టె పోస్టులను



వదలమని స్పష్టం చేశారు. అభ్యర్థులపై పెట్టే పోస్టులపై జిల్లా అధికారులు నివేదికలు పంపుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు తప్పనిసరిగా అనుమతులు పొందాల్సి ఉంటుంది.ఇందుకు డిఎస్పీ వద్ద దరఖాస్తు చేసుకోవాలి. కార్యక్రమం చేపట్టే కంటే ముందుగానే దరఖాస్తు సమర్పించాలి.సభకు ఎంతమంది హాజరవు తారు ? ఎంతసేపు కొనసాగుతుంది ? వాహనాలు ఎన్ని ? మైక్‌ల ఏర్పాటు విషయాలపై పూర్తి సమాచారాన్ని సమ ర్పించాల్సి ఉంటుంది. కోడ్‌కు లోబడి అనుమతులు జారీ చేస్తారు. ప్రయివేటు స్థలాల్లో ప్రచారానికి యజమాని అనుమతి తప్పనిసరి తీసుకోవాలి.

కేరళ సాంప్రదాయ చిత్రానికి జాతీయ అవార్డు

నవతెలంగాణ-మహదేవ్‌పూర్



కేరళ రాష్ట్రంలోని అల్లేప్పెలో అక్టోబర్ 8,9,10 మూడు రోజుల పాటు నిర్వహించిన 'ఉస్సేన్ ఖాన్ సిక్స్ నేషనల్ లెవెల్ వర్క్ షాప్'లో మహాదేవపూర్ ఫొటో గ్రాఫర్ పంతకాని రాజు తీసిన కేరళ సాంప్రదాయ నృత్యం 'తెయ్యం' దేవత చిత్రానికి తృతీయ బహుమతి లభించింది. ఉస్సేన్‌ఖాన్ చేతుల మీదుగా ఫోటో గ్రాఫర్ పంతకాని రాజు ఈ అవార్డు అందుకున్నారు. కేరళ సంప్రదాయంలోని కథకళి, తెయ్యం,కడియరపట్టు కళలపై ఫోటో వర్క్ షాప్ జరుగగా, తెయ్యం దేవత చిత్రానికి ఈ అవార్డు లభించిందని పంతకానీ రాజు తెలిపారు. జాతీయ స్థాయిలో అవార్డుల పంట పండిస్తున్న పంతకాని రాజును సర్పంచ్ శ్రీపతిబాపు అభినందించారు.

భారత రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి : కె జయరాం

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్



భారత రాష్ట్రపతి , తెలంగాణ రాష్ట్ర గవర్నర్ మహిళలేనని, వారిని గొప్ప స్త్రీలను విద్యార్థినులు, మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే జయరాం రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ మరియు జిల్లా సంక్షేమ శాఖ సం యుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. స్థానిక గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జరిగిన సమావేశంలో జడ్జి హాజరై మాట్లాడారు. కొద్దీ రోజుల క్రితం భారత పార్లమెంట్ లో మహిళా బిల్లు పాస్ కావడం శుభ పరిణామం అన్నారు. నేటి ఆధునిక సమాజంలో స్త్రీ పురుష బేధం అనేది ఉండకూడదని అన్నారు. జిల్లాలో ఎవరికీ ఆపద వచ్చిన న్యాయసేవాధికార సంస్థ అండగా ఉంటుందని అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నాగేశ్వర్ రావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు దామోదర్, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సోమా నర్సయ్య, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మీడియా సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-భూపాలపల్లి

నూతన సమీకృత జిల్లా కార్యాలయాల భవనం లోని డీపీఆర్ఓ కార్యాలయం (జీ-13)లో ఏర్పాటుచేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ)ను జిల్లా కలెక్టర్ భవష్ మిశ్రా భుధవారం ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎప్పటి కప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎంసిఎంసి కమిటీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ , ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనలకు వంటివి సకాలంలో ఆమోదం మంజూరు చేయాలని అన్నారు. వార్తా పత్రికలు, ఈ-పేపర్‌లు, టెలివిజన్ ఛానెల్‌లు, స్థానిక కేబుల్ నెట్‌వర్క్‌లు, సోషల్ మీడియా, మూవీ హౌస్‌లు మరియు ఎస్ఎంఎస్‌లు, ఇతర ఆడియో-వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎంసీఎంసీ నుండి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాలని తెలిపారు. డీపీఆర్ ఓవి శ్రీధర్, ఎంసీఎంసీ సభ్యులు ఎస్ శ్రీధర్, ఎఫ్‌పీఓ స్వామిగౌడ్, ఈడీఎం శ్రీకాంత్, ఎన్నికల పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

50 రోజుల అక్షర యుద్ధం చేయండి

- హ్యాట్రిక్ సీఎం సాకారం మీతోనే...
- జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి

నవతెలంగాణ -ములుగు



రానున్న 50 రోజుల పాటు సోషల్ మీడియాలో అక్షరయుద్ధం చేయాలని జెడ్పీ చైర్ పర్సన్, బీఆర్ఎస్ ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి పార్టీ సోషల్ మీడియా వారియర్స్‌కు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని లీలాగార్డెన్‌లో ఏర్పాటు చేసిన ములుగు నియోజక వర్గ పార్టీ సోషల్ మీడియా వారియర్స్ ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్,రెడ్ కో ఛైర్మెన్ వై సతీష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ గోవింద్ నాయక్‌తో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత అభివృద్ధి చెందుతున్న రోజులలో చరవాణి ప్రతి ఒక్కరికి అత్యవసర వస్తువుగా మారిందని అన్నారు. దీనిని ఉపయోగించి ఇందులో ఉన్న వివిధ అంశాలను, ఇంటర్‌నెట్‌ను ఉపయోగించుకుని ఎన్నో అద్భుతాలను సృష్టించొచ్చని అన్నారు. వాట్సాప్,ఫేస్ బుక్, ట్విట్టర్ వంటి వేదికల ద్వారా ప్రభుత్వ అద్భుత పథకాలకు సంబంధించిన సమాచారాన్ని క్షణాలలో కొన్ని లక్షల మందికి చేరే వేయవచ్చునని అన్నారు. హ్యాట్రిక్ సీఎం సాకారం చేసుకోవడం లో సోషల్ మీడియా వారియర్స్ పాత్ర ఎంతో ప్రత్యేకమైనదని అన్నారు. మారుమూల గ్రామంలో ఉన్న తనను సీఎం కేసీఆర్ దృష్టికి వెళ్లేలా చేసింది సోషల్ మీడియానేనని అన్నారు. నియోజక వర్గంలో సోషల్ మీడియాలో జరిగే యుద్ధంలో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు రైతు బందు సమితి అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, ములుగు జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు శీలం మధు, ఓడీసీఎం వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గోవిందరావుపేట ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి, తాడ్వాయి ఎంపీపీ గొంది వాణిశ్రీ, గుడివాడ శ్రీహరి, నియోజకవర్గం లోని అన్ని మండలాల సోషల్ మీడియా అధ్యక్షులు, దుర్గం రమణయ్య, కోగిల మహేష్, మండల అధ్యక్షులు కొమ్మనిబోయిన వేణు, సూరయ్య, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదుపై స్పందించాలి

- జయశంకర్-భూపాలపల్లి జిల్లా ఎస్పీ పుల్ల కరుణాకర్

నవతెలంగాణ-భూపాలపల్లి



పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు పై వెంటనే స్పందించి, విచారణ జరిపి బాధితులకు పూర్తి భరోసా, ధైర్యాన్నిచ్చేలా పనిచేయాలని జయశంకర్ భూపాల పల్లి జిల్లా ఎస్పీ పుల్లా కరుణాకర్ అన్నారు. బుధవారం టేకుమట్ల పోలిస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. స్టేషన్ లోని పలు రికార్డులను రిసెప్షన్, వివిధ విభాగాలను పరిశీలించారు. పోలీసు సిబ్బంది విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ కరుణాకర్ మాట్లాడుతూ పోలిస్ సిబ్బంది, అధికారులు సాంకే తికతను అందిపుచ్చుకుంటూ సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతి గ్రామం పట్ల పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. దొంగతనాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు. సమస్యలు సృష్టించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గంజాయి, మద్యం, నగదు అక్రమ రవాణాను నిరోధించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ ఎ రాములు, చిట్యాల సీఐ వేణు చందర్, టేకుమట్ల ఎస్సై సుధాకర్, సీసీ ప్రదీప్ పాల్గొన్నారు.



గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

నవతెలంగాణ-ములుగు

గాలికుంట వ్యాధిని నిరోధించేందుకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా పశు వైద్య, సంవర్ధకశాఖ అధికారి విజయభాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలో వెటర్నరీ అధికారి డాక్టర్ నరసింహతో కలిసి మాట్లాడారు. గాలికుంట వ్యాధి వల్ల పశువులు రోగ నిరోధక శక్తి తగ్గి క్షీణించిపోయి మరణించే ప్రమాదం ఉందని అన్నారు. పాలిచ్చే పశువులులలో పాల ఉత్పత్తి తగ్గి నీరసంతో మృతి చెందే అవకా శం ఉందన్నారు. ఇందుకోసం రాజీవ్ కృషి యోజన కింద ఉచితంగా గాలిగుంట వ్యాధికి టీకాలు అందజేస్తున్నామని అన్నారు. పశువుల గుర్తింపు కోసం ప్రత్యేక కార్డులు పశువులకు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

డిసెంబర్ 27న సింగరేణి ఎన్నికలు

- వాయిదా వేస్తూ తెలంగాణ హైకోర్టు సంచలన నిర్ణయం
- మూడుసార్లు వాయిదా పడ్డ సింగరేణి ఎన్నికలు

నవతెలంగాణ -కోల్‌బెల్ట్

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను డిసెంబర్ 27 కు వాయిదా వేస్తూ తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ సహకారం లేకుండా సింగరేణిలో ఎన్నికలు జరపలేమని సింగరేణి యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేస్తూ హైకోర్టు తీర్పును యాజమాన్యానికి అనుకూలంగా వెలువరించింది. దీనితో ఇప్పటికి సెంట్రల్ లేబర్ కమిషన్ (సిఎల్సి) సింగరేణి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినప్పటి దగ్గర నుండి సింగరేణి ఎన్నికలు మూడుసార్లు వాయిదా పడ్డాయి. డిసెంబర్ 27 ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 30 లోపు ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని యాజమాన్యాన్ని కోర్టు ఆదేశించింది. ఈనెల 28న ఎన్నికల నిర్వహించేందుకు కేంద్ర కార్మిక శాఖ సిద్ధమైంది. కానీ హైకోర్టు తీర్పుతో సిఎల్సి వెనక్కి తగ్గాల్సి వచ్చింది. గత ఏడాది నుంచి హైకోర్టులోనే సింగరేణి ఎన్నికల వివాదం జరుగుతుంది. ఎన్నికలు నిర్వహణపై హైకోర్టు ఇప్పటికి మూడుసార్లు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 23న సింగరేణి ఎన్నికలపై హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఉత్తర్వులపై సింగరేణి యాజమాన్యం చీఫ్ కోర్టులో అప్పీల్ చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం వాదనలు విన్న హైకోర్టు డిసెంబర్ 27న సింగరేణిలో ఎన్నికలు నిర్వహించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

- అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ అంకిత్

నవతెలంగాణ-ములుగు



ఎన్నికలు సజావుగా సాగడంలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైందని ములుగు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో అసెంబ్లీ నియోజకవర్గం సెక్టోరల్ అధికారులతో ఎన్నికల ప్రక్రియపై సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ... ఒక సెక్టోరల్ అధి కారి పరిధిలో 6 నుండి 9 పోలింగ్ కేంద్రాలు ఉండే అవకాశం ఉందని, పోలింగ్ కేంద్రాలలో వసతులు, ర్యాంపులు, నీటి వసతి, ఫర్నిచర్, విద్యుత్, ఫ్యాన్లు, పోలింగ్ కేంద్రంలో ఏదైనా మరమ్మత్తులు ఉంటే పూర్తి చేసి అన్ని వసతులను పరిశీలించి సంబంధిత ఫార్మాట్లో వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికలు జరిగే వారం ముందు నుండి మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పోలింగ్ సిబ్బందిని తీసుకువెళ్లి తిరిగి తీసుకురావడం, ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో నెలకొన్న సమస్యలపై ఎన్నికల అధికారుల దష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని అన్నారు. రిజర్వు ఈవీఎం అందుబాటులో ఉంచుకోవడం, ఎన్నికల రోజున తమకు కేటాయించిన రూట్ పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. తహసిల్దార్లు, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి పోలింగ్ కేంద్రంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో సెక్టోరల్ అధికారులు, ములుగు తహసిల్దార్ విజయ భాస్కర్, ఎన్నికల విభాగం డీటీలు విజయకుమార్, అనీస్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతున్న ఇద్దరు అరెస్ట్

నవతెలంగాణ-గణపురం



గణపురం మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై మచ్చ సాంబమూర్తి బుధవారం తెలిపారు. గణపురం ఎస్సీ కాలనీకి చెందిన కోయిలా అంబేద్కర్. పెంద్యాల వెంకటేష్ బీజాపూర్ నుండి గంజాయి తక్కువ ధరకు కొనుక్కొని వచ్చి ఇక్కడ ఎక్కువ ధరకు అమ్ముతున్నాడని తెలిపారు. ఈ క్రమంలో అమ్మటానికి ప్రయత్నం చేస్తుండగా వారిని పాత ఎమ్మార్వో ఆఫీస్ దగ్గర పట్టుకొని 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ఎవరైనా మండలం లో గంజాయి అమ్మినట్లు తెలిస్తే 8712658122కు కాల్ చేసి చెప్పాలని, వారి పేరు గోప్యంగా ఉంచుతామని ఎస్సై వివరించారు.



6లక్షల43వేల చేప పిల్లలు పంపిణీ

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని మహాదేవపూర్, బెగుళూరు, సూరారంరాపల్లి కోట, ఎనకపల్లి, కృష్ణరావుపేట, అంబటిపల్లి, పలిమెలమండలంతోపాటు రెండు మండలాలకు 6లక్షల43వేల చేప పిల్లలను బుధవారం మత్స్యశాఖ జిల్లా అధికారి అవినాష్ ఆధ్వర్యంలోఆయా చెరువుల్లో వదిలారు. ఈ కార్యక్రమంలో రాపల్లి కోట మత్స్యశాఖ అధ్యక్షులు బొగ్గుల చంద్రయ్య, ఉపాధ్యక్షులు చల్ల శంకర్, సంఘ సభ్యులు సమ్మయ్య, బల్ల పోచయ్య సమ్మయ్య, సురేష్, తిరుపతి, వేల్పుల సమ్మయ్య, మత్స్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మండలంలోని పెద్దంపేట గ్రామంలో బెల్ట్ షాపులలో .బుధవారం పోలీసులు తనిఖీలు చేసి 39 బీర్లు, 12 క్వార్టర్‌లు స్వాధీనం చేసుకొని ముగ్గురిపై మహదేవ్ పూర్ ఎస్సై రాజ్ కుమార్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



డబుల్ బెడ్రూమ్ ఇండ్ల కేటాయింపులో అక్రమాలు

- భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట మహిళల ఆందోళన

నవతెలంగాణ-భూపాలపల్లి

జయశంకర్ భూపాల పల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని అనర్హులకు ఇండ్లను కేటాయించారని తెలుపుతూ బుధవారం పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన నిరుపేద మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన ధర్నా కార్యక్రమం చేపట్టారు. డబ్బులు ఇచ్చిన వారికే ఇండ్లు కేటాయించారని అట్టి - ఇండ్లను రద్దుచేసి నిరుపేదలమైన తమకు న్యాయం చేయాలని జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు మొదట పారదర్శకంగా ఇండ్లు కేటాయిస్తున్నామని చెప్పి మంజూరు లిస్టులో పేర్లు ప్రకటించి అధికారులు ప్రజాప్రతినిధులు రాత్రికి రాత్రి వారికి ఇష్టం వచ్చినవారికి అనర్హులకు డబ్బులు ఇచ్చిన వారికే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించారని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా వారికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ వార్డ్ కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పల రాజేందర్ మద్దతు తెలిపి మాట్లాడారు. అనర్హులకు కేటాయించిన ఇండ్లను తక్షణమే రద్దు చేయాలని అక్రమంగా కేటాయించిన ఇండ్ల విషయంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులతో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆయిల్ పామ్ సాగుతో ఆదాయం రెట్టింపు


- మండల హార్టికల్చర్ అధికారి డాక్టర్ కళ్యాణి

నవతెలంగాణ-గోవిందరావుపేట

ఆయిల్ పామ్ సాగుతో రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని మండల హార్టికల్చర్ ఆఫీసర్ కళ్యాణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్ గోపాల్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కళ్యాణి మాట్లాడారు. మండలంలో 1000 ఎకరాలు ఆయిల్ పామ్ సాగు లక్ష్యం కాగా ఇప్పటివరకు 620ఎకరాలలో సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఎకరానికి 57 మొక్కలు అవసరమవుతాయని 90 శాతం సబ్సిడీపై ప్రభుత్వం రైతులకు అందిస్తుందని అన్నారు. ఒక్కొక్క మొక్కకు రెండు వందల రూపాయలు ఖర్చుకాగా రైతు వాటాదనంగా 20 రూపాయలు చెల్లిస్తే సరిపోతుందని అన్నారు. మొదటి మూడు సంవత్సరాలు మాత్రమే ఆదాయం ఉండదని తర్వాత 30 సంవత్సరాల వరకు ప్రతి సంవత్సరం ప్రతి నెల ఆదాయం ఉంటుందని అన్నారు. వాటర్ సౌకర్యంతో పాటు డ్రిప్పు ఫెసిలిటీ ఉన్న రైతులు పట్టేదారు పాస్ పుస్తకంతో పాటు ఆర్ఓఎఫ్ ఆర్ పాస్ పుస్తకాలు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇంటర్ కల్టివేషన్ లో భాగంగా ఎకరానికి నాలుగువేల రూపాయలను ప్రభుత్వం రైతుకు చెల్లిస్తుందని అన్నారు. ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులను స్ఫూర్తిగా తీసుకొని ఇతర రైతులు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు డి దాదాసింగ్ ఎండి ఫియాజ్, హెచ్ ఈ ఓ రమేష్, ఫీల్డ్ ఆఫీసర్ అనిరుద్ పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలన సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడిగా సందుపట్ల రవి

నవతెలంగాణ- తాడ్వాయి



ములుగు జిల్లా మూఢనమ్మకాల నిర్మూలన సంఘం జిల్లా అధ్యక్షునిగా ములుగు జిల్లా తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన సందుపట్ల రవిని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బైరి నరేష్ నియమించినట్టు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మూఢనమ్మకాల నిర్మూలన సంఘం సెప్టెంబర్ 17, 2023లో స్థాపించారని అన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన బైరి నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రవి మాట్లాడుతూ.. రోజురోజుకు సైన్స్ అభివృద్ధి చెందుతున్నా మూఢనమ్మకాలను విశ్వసించడం సరికాదన్నారు. మూఢనమ్మకాల నిర్మూలన పూర్తి సమాచారం కోసం 898568 2491లో సంప్రదించొచ్చని అన్నారు.

వైఎస్సార్‌టీపీ, బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిక

- ఆహ్వానించిన జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్

నవతెలంగాణ- ములుగు



తాడ్వాయి మండలం దామెరవాయి గ్రామా నికి చెందిన వైయస్ఆర్‌టీపీ తాడ్వాయి మండల అధ్యక్షులు భాగే నర్సింహులు, రామ సాయం మల్లయ్య, బీఆర్ఎస్ మాజీ గ్రామ కమిటీ అధ్య క్షులు దెందరి రంజిత్, పంబా పూర్ గ్రామానికి చెందిన మోరే భిక్షపతి, అప్రజి తిరుపతి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవరాం వారికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్ల పెల్లి రాజేందర్ గౌడ్,మండల అధ్యక్షులు బోల్లు దేవేందర్, ఎండీ చాంద్ పాషా,జిల్లా నాయకులు ఆర్రెం లచ్చు పటేల్,వర్కింగ్ కమిటీ అధ్యక్షులు నల్లెల భరత్ కుమార్,బండి శ్రీనివాస్ బీసీ సెల్ మండల అధ్యక్షులు పొడాల ఓం ప్రకాష్, పంబపూర్ సర్పంచ్ ఎలవెన జానకి రాంబాబు,సహకార సంఘం డైరెక్టర్ యానాల సిద్ది రెడ్డి,బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు గుండ బోయిన రమేష్, మాజీ సర్పంచ్ తప్పెట్ల మొగిలి, ఎస్సీ సెల్ మండల నాయకులు తప్పెట్ల, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల పనితీరు బాగా లేకనే రాజీనామా



నవతెలంగాణ-మల్హర్‌రావు

బీఆర్ఎస్ మండల స్థాయి నాయకుల పనితీరు బాగలేకనే చాలా రోజుల నుంచి విసుగు చెంది తాను బీఆర్ఎస్ పార్టీకి, సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు కాకతీయ విద్యార్థి ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ నాయకుడు కుంభం సురేష్ రెడ్డి తెలిపారు. బుధవారం కొయ్యూర్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మండలంలోని కొండంపేట గ్రామానికి చెందిన తాను కాకతీయ విద్యార్థి ఉద్యమ నాయకుడిగా, మంథని డివిజన్ లో బీఆర్ఎస్ పార్టీ నాయకుడిగా నిస్వార్థంగా పనిచేసినట్టు చెప్పారు. అనేక అవమానాలు, ఆటుపోట్లను ఎదురుకున్నట్లు చెప్పారు. 2014లో బీఆర్ఎస్‌లో పుట్ట మధు నాయకత్వం కోసం పాటు పడటం జరిగిందన్నారు. బీఆర్ఎస్ మండల నాయకుల పని తీరుకు విసుగు చెంది 14 సంవత్సరాల పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయడం జరిగిందన్నారు.

17న కాళేశ్వరం ఆలయంలో సామూహిక హోమం : ఆలయ ఈఓ మహేష్

నవతెలంగాణ-మహాదేవ్‌పూర్

మండలంలోని ప్రముఖ కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలో ఈనెల 17వ తేదీన ఉదయం 11 గంటలకు సామూహిక హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్ మహేష్ బుధవారం ప్రకటనలో తెలిపారు. హోమంలోఅందరూ పాల్గొనాలని కోరారు. హోమంలో పాల్గొనే వారు రూ.1000 చెల్లించి టికెట్ పొందాలని అన్నారు. టికెట్ తీసుకున్న వారికి పూజా సామాగ్రి దేవస్థానం నుండి సమకూరుస్తామని తెలిపారు. పూలు పండ్లు హారతి పళ్లెం కలశం చెంబు తీసుకురావాలని .రావాలని తెలిపారు.

గిరిజన బిడ్డలకు క్షమాపణలు చెప్పాలి : రెడ్కో చైర్మన్ వై సతీష్‌రెడ్డి



నవతెలంగాణ-ములుగు

గిరిజన యూనివర్సిటీ పేరుతో కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి రాజకీయాలు చేస్తున్నాయని తెలంగాణ రెడ్కో చైర్మన్ వై. సతీష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ములుగులో జరిగిన నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గిరిజన యూనివర్సిటీ పేరుతో చలో మేడారం అంటూ ప్రజల దృష్టిని మరల్చేందుకు బీజేపీ డ్రామాలాడుతోంద మండిపడ్డారు. నాలుగైదేళ్లక్రితం రావాల్సిన గిరిజన యూనివర్సిటీ.. బీజేపీ వల్లే ఆలస్యం అయిందన్నారు. గిరిజన యూనివర్సిటీ ఇన్నేళ్లు ఎందుకు ఆలస్యం చేశారో చెప్పాలన్నారు. ఎన్నికల ముందు గిరిజన యూనివర్సిటీ ప్రకటిస్తున్నామని చెప్పి ఆ యూనివర్సిటీకి సమ్మక్క సారలమ్మ వనదేవతల పేర్లు పెట్టి ప్రజల మనోభావాలతో రాజకీయం చేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. మన దేవతల పేరు పెట్టడాన్ని స్వాగతిస్తున్నామని.. కానీ ఆ పేరుతో రాజకీయం చేయాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను ఉపేక్షించేది లేదన్నారు. గిరిజన యూనివర్సిటీ బీజేపీ బిక్ష కాదని ఈ ప్రాంత ప్రజల హక్కు అన్నారు. కిషన్ రెడ్డి మేడారం వెళ్లి గొప్పలు చెప్పుకోవడం కాదని, గిరిజన యూనివర్సిటీ ఎందుకు ఆలస్యమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. నాలుగైదేళ్ల క్రితమే వర్సిటీ ఇచ్చి ఉంటే ఈ ప్రాంతం కూడా చాలా అభివృద్ధి చెంది ఉండేదన్నారు. వర్సిటీని ఆలస్యం చేసి ఈ ప్రాంత బిడ్డల ఉపాధి అవకాశాలను బీజేపీ దెబ్బతీసిందన్నారు. ములుగు తీరని నష్టం చేసిన బీజేపీ ఇప్పుడు కేవలం ఎన్నికల్లో యూనివర్సిటీ పేరు చెప్పి నాలుగు ఓట్లు దండుకోవాలని కుటిల రాజకీయానికి తెరలేపిందన్నారు. ఇందులో భాగంగానే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మేడారం వచ్చారన్నారు. ములుగు ప్రాంత అభివృద్ధిని దెబ్బతీసినందుకు మొదటగా కేంద్ర ప్రభుత్వం, బీజేపీ, కిషన్ రెడ్డి ములుగు ప్రజలకు, ఇక్కడి గిరిజన బిడ్డలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాల కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌కు పిలుపునిచ్చారు. అలాగే సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొంతమంది చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని సమర్థవంతంగా ఎలా తిప్పికొట్టాలనే దానిపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ములుగు జడ్పీ చైర్ పర్సన్, బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ అభ్యర్థి బడే నాగజ్యోతి, ములుగు జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్నాయక్, వరంగల్ ఓడిసిఎంఎస్ సూడి శ్రీనివాస్ రెడ్డి, ములుగు జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షులు పల్లె బుచ్చయ్య, తాడ్వాయి ఎంపీపీ వాణిశ్రీ, ములుగు జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు శీలం మధు, ఏటూరునాగారం ఆత్మ కమిటీ చైర్మన్ దుర్గం రమణయ్య నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు కోగీల మహేష్, కొత్తగూడ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు, గంగారం మండల అధ్యక్షుడు ఈర్ప సూరయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు సురేందర్, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



దళిత బంధు గృహలక్ష్మి పథకాలను అంగట్లో అమ్ముకుంటున్నారు

- అసలైన లబ్ధిదారులకు మొండి చేయి
- కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ స్టేట్ వైస్ చైర్మన్ దూడపాక శంకర్

నవతెలంగాణ-గణపురం

బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు, గృహలక్ష్మి పథకాన్ని అంగట్లో సరుకులా అమ్ముకుంటున్నారని కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ స్టేట్ వైస్ చైర్మన్ దూడపాక శంకర్ అన్నారు. బుధవారం గణపురం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పాటు గణపురం మండలంలో సర్పంచులు ఎంపీటీసీలు గ్రామ శాఖ అధ్యక్షులు అధికార పార్టీ ముఖ్య నేతలు గ్రూపులుగా ఏర్పడి ఒక్కో యూనిట్ కు మూడు నుండి నాలుగు లక్షలు వసూలు చేశారని తెలిపారు ఎన్నికల నోటిఫికేషన్ కు పది రోజుల ముందు నుండి ఈ ప్రక్రియ ప్రారంభించారని శంకర్ అన్నారు. ఒక్కో మండలంలో టిఆర్ఎస్ నాయకులు మూడు నాలుగు గ్రూపులుగా ఏర్పడి దళిత బంధు గహలక్ష్మి పథకాలను అంగడిలో సరుకులా అమ్ముకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు. ఏ పార్టీకి చెందిన వారైనా అర్హులైన నిరుపేదలకు అందాల్సిన ప్రభుత్వ పథకాలను కోట్ల రూపాయల ఆస్తులు ఉన్న వారికి డబ్బులు తీసుకొని జాబితాలో పేర్లు నమోదు చేశారన్నారు. గణపురం మండలంలో దళిత బంధు గహలక్ష్మి పథకాల లబ్దిదారులపై వెంటనే కలెక్టర్ విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు రేపాక రాజేందర్ గ్రామ శాఖ అధ్యక్షులు ఓరంగంటి కష్ణ గౌడ్, మామిండ్ల మల్లికార్జున గౌడ్ మామిండ్ల మల్లేష్ యాదవ్ చిలువేరు ఉదయాకర్ దూడపాక దుర్గయ్య మండ అశోక్ గౌడ్, ఎన్నిండ్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.



రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

నవతెలంగాణ-ములుగు

ములుగు మండల మదనపల్లి గ్రామంలో క్లస్టర్ ఇంఛార్జి నూనేటి శ్యామ్ ఆధ్వర్యంలో బుదవారం ఇంటింటి ప్రచారం నిర్వహించగా అట్టి ప్రచార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్ విచ్చేసి ఇంటింటికి తిరుగుతూ ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు రైతు భరోసా, యువ వికాసం, గహలక్ష్మి, గృహజ్యోతి, రాజీవ్ ఆరోగ్య శ్రీ, చేయూత లాంటి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తామని, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని ప్రజలను కోరుతూ ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇటీవల హైదరాబాద్ యందు తుక్కుగూడలో జరిగిన విజయభేరి సభలో ఆరు గ్యారెంటీ పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారెంటీ పథకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్ల లక్ష్మి – నర్సయ్య, సీనియర్ నాయకులు బదర్ జి, మాజీ ఎంపీటీసీ పోరిక మధు, వార్డు సభ్యులు నారాయణ సింగ్, నేత సాగర్, రాజన్న గౌడ్, యాదగిరి, సత్యం, రాజన్న, మంజు నాయక్, శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.



జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన నోడల్ ఆఫీసర్

నవతెలంగాణ-మహాదేవ్‌పూర్

మహాదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ దేవరాజం కళాశాలను బుధవారం సందర్శించారు. అధ్యాప కులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులందరూ రెగ్యులర్‌గా కళాశాలకు వచ్చే విధంగా చూడాలని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి మంచి ఫలితాలను తీసుకురావాలని అధ్యాపకులకు సూచించారు. గత సంవత్సరం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఎంపీసీ గ్రూప్ విద్యార్థి అశ్ర భాను, బైపీసీ విద్యార్థి ముక్తి ప్రసాద్‌ల ఇద్దరికి నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని అన్నారు. వారిని నోడల్ ఆఫీసర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఇన్‌ఛార్జ ప్రిన్సిపాల్ ప్రసాద్, సరిత, సదాశివ్, సదానందం, విజయ, రామారావు, శ్వేత, రమాదేవి, శైలజ, పిన్నయ్య, నాగలక్ష్మి పోచయలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సీతక్కపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, సర్పంచ్ అహ్మద్ పాషా



నవతెలంగాణ-ములుగు

ఎమ్మెల్యే సీతక్క పై దుర్మార్గులు అసత్య ప్రచారాలు మాను కోవాలని, పినపాక నియో జకవర్గంకు సీతక్కను పంపించే ఆలోచన రాష్ట్ర కాంగ్రెస్ కమిటీకి లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కాసిందేవిపేట సర్పంచ్ అహ్మద్ పాషా అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ములుగు నియోజకవర్గ ప్రజల, అభిమానం మధ్యలోనే ఎమ్మెల్యే సీతక్క ఉంటుందని, కరోనా, వరద బాధింబు-యబ కష్టకాలంలో ప్రాణలను సైతం లెక్కచేయకుండా అలుపెరుగని సేవలు అందించారని అన్నారు. ప్రజల కష్టసుఖాలలో నిత్యం ఉండేది ఎమ్మెల్యే సీతక్క అని అన్నారు. ప్రజలారా అధికార పార్టీ నేతల కుట్రలను ఎండగట్టాలని, ములుగులో ఎమ్మెల్యే అభ్యర్థిగా సీతక్కదే గెలుపని ధీమా వ్యక్తం చేశారు. అసత్యప్రచారాలు నమ్మవద్దని, రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే నని ములుగులో అత్యధిక మెజారిటీతో గెలిచేది ఎమ్మెల్యే సీతక్క అన్నారు. కొంతమంది దుర్మార్గులు సీతక్క పై అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని, ఆ దుర్మార్గులకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు.

సంక్షేమ పథకాలే గెలుపునకు సోపానాలు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు



నవతెలంగాణ-ములుగు

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో దేశం గర్వించేలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు అన్నారు. బుధవారం నవ తెలంగాణతో ఆయన మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆయన స్పష్టం చేశారు. అడగకుండానే అన్ని ఇచ్చి జిల్లా ప్రజల సంక్షేమం కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తికి ములుగు నియోజకవర్గ ప్రజలు ఇచ్చే ఏకైక బహుమానం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు ఒకటేనని ఆయన స్పష్టం చేశారు. నిబద్ధతతో పనిచేసే ప్రతి కార్యకర్తకు అద్భుతమైన అవకాశం అనడానికి బడే నాగజ్యోతి నిలువెత్తు నిదర్శనమన్నారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, రెడ్కో చైర్మన్ సతీష్ రెడ్డి, దివంగత నేత జిల్లా పరిషత్ చైర్మన్ కుసుమ జగదీష్ ఆధ్వర్యంలో జిల్లాకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని అన్నారు. పభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే మరోసారి బీఆర్ఎస్ పార్టీకి హ్యాట్రిక్ విజయాన్ని చేకూర్చుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

సింగరేణి ఎన్నికలను ఆపడం ప్రభుత్వ కుట్ర

- రూ.లక్షలాది సింగరేణి సొమ్ము వృధా
- డిసెంబర్ 27న సింగరేణి ఎన్నికలు
- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్
- ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్



నవతెలంగాణ-భూపాలపల్లి

సింగరేణి యాజమాన్యం ప్రభుత్వం కుట్ర చేసి సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను కుట్ర చేసి ఎన్నికలు వాయిదా వేయడం జరిగిందని, డిసెంబర్ 27న ఎన్నికలు నిర్వహించాలని కోర్టు తీర్పు ఇవ్వడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఏఐటీయూసీ కొమురయ్య భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో 2017లో నిర్వహించిన ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా గెలిచిన టీబీజీకేఎస్ రెండు సంవత్సరాల కాలం గెలిచిన ప్రభుత్వ సహకారంతో ఆ తర్వాత రెండు సంవత్సరాల కాల పరిమితి పెంచ డం జరిగిందని, దాని ప్రకారం సింగరేణిలో తిరిగి 2019లో ఎన్నికలు జరగాల్సి ఉందన్నారు. కాగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం అడ్డుకొని ఆరు సంవత్సరాల కాలం పాటు టీబీజీకేఎస్ స్ట్రక్చర్, జెసిసి సమా వేశాలు నిర్వహించకుండా ఎలాంటి పోరాటాలు, అగ్రిమెంట్ లేకుండా అధికారంలో కొనసాగిందనిన్నారు. దీనివల్ల కార్మిక సంఘానికి నష్టం జరుగుతుందని కార్మిక సంఘాలన్నీ తిరిగి 2022లో 9అంశాల మీద అగ్రిమెంట్ చేసుకున్నప్పటికీ అమలు కావడం లేదన్నారు. సింగరేణి యాజమాన్యం టీబీజీకేఎస్ వాటిని తుంగలో తొక్కి పెట్టాయి. ఆ కారణంగా కార్మిక పక్షపాతిగా ఉన్న ఏఐటియుసి 2022లో హైకోర్టును సింగరేణిలో ఎన్నికలు నిర్వహించాలని పిటిషన్ వేయడం జరిగిందని తెలిపారు. మార్చి నెలలో సింగరేణిలో ఎన్నికలు చేపట్టాలని యాజమాన్యం ఉద్దేశించి కానీ యాజమాన్యం హైకోర్టును ఆదేశించి హైకోర్టు ఆదేశాన్ని ధిక్కరించి కంపెనీ ఉత్పత్తికి విఘాతం కలుగుతుందని షాక్‌తో జూన్ నెలలో ఎన్నికలు వాయిదాలు కోరిందని అన్నారు. తన మానస పుత్రిక అయిన టీబీజీకేస్ కోర్టుకు పంపి ఆరు జిల్లాల కలెక్టర్ పోలీసులను అధికారంలో ఉన్న అధికారులతో సింగరేణిలో ఎన్నికలు నిర్వహించడానికి భద్రత కల్పించలేమని నక్సలైట్ల ప్రభావం ఉందంటూ కోర్టును తప్పుదోవ పట్టించిందన్నారు. యాజమాన్య వైఖరిని అర్థం చేసుకున్న సింగిల్ బెంచ్ కోర్టు అక్టోబర్ 28న ఎన్నికలు నిర్వహించడానికి ఆదేశించిందని తెలిపారు. దాంతో సకల ప్రభుత్వ శాఖలను ప్రభావితం చేసి ఎన్నికల ముందు వచ్చినటువంటి కార్మిక సంఘాలను చీల్చి కొన్ని సంఘాలతో అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఎన్నికలు చేపట్టడానికి ప్రభుత్వం యాజమాన్యం కుట్రతో ఎన్నికలను వాయిదా వేయడం జరిగిందన్నారు. ఈలోగా అక్టోబర్ 6, 7 తేదీల్లో డిప్యూటీ లేబర్ కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేయగా 15 కార్మిక సంఘాల్లో పాల్గొనడానికి సిద్ధపడుతూ నామినేషన్లు చేశాయని అన్నారు. దీంతో కలవర పడ్డ యాజమాన్యం ప్రభుత్వం కార్మిక సంఘాల అభిప్రాయాన్ని జిల్లా కలెక్టర్ ఎస్పీల ఉత్తరాలను పట్టుకొని హైకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం సింగరేణిలో ఎన్నికలు నిర్వహించలేమని మళ్లీ యాజమాన్యం వాయిదా వేసిందన్నారు. లేబర్ డిపార్టుమెంటు కార్మిక సంఘాలకు సింగరేణి యాజమాన్యం లిస్ట్ ఇవ్వకుండా హాజరు కాకుండా యాజమాన్యం తప్పించుకుంటున్న ఈ క్రమంలో లక్షలాది రూపాయల సింగరేణి డబ్బులు ఖర్చు పెట్టి ఎన్నికల వాయిదాను కుట్రపన్నిందని ఆరోపించారు. చివరికి హైకోర్టు ఫుల్ బెంచ్ ప్రభుత్వ యాజమాన్యం తలవంచి అసెంబ్లీ ఎన్నికల తర్వాత డిసెంబర్ 27వ తేదీన సింగరేణి ఎన్నికల నిర్వహించాలని తీర్పునిచ్చిందని తెలిపారు. ఈ సింగరేణి ఎన్నికలు వాయిదా పడడానికి ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం టీబీజీకేఎస్ 13 కార్మిక సంఘాల యాజమాన్యానికి వంత పాడాయని ఆరోపించారు. కార్మిక వర్గ ప్రయోజనాల కోసం భిన్నంగా సింగరేణి ఎన్నికలు వేశారని ప్రభుత్వానికి యాజమాన్యం లొంగిపోయిన కార్మిక సంఘాలు చేసిన ద్రోహాన్ని ఎన్నికలు వాయిదా పడ్డ విషయం కార్మిక లోకం గమనించాలని అన్నారు. డిసెంబర్ 27న జరిగే ఎన్నికల్లో ప్రభుత్వం కార్మిక వర్గ ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటిసిని గెలిపించాలని విజ్ఞప్తి రాజ్ కుమార్ చేశారు. భిన్నంగా ప్రవర్తిస్తున్న కార్మిక సంఘాల ను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోట పలుకుల రమేష్, గోవిందుల తిరుపతి, అల్లి చీరలు ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.



పుట్ట మధుకు భారీ షాక్

- కాటారం ఉపసర్పంచ్, బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ- మహదేవ్‌పూర్

మంథని బీఆర్ఎస్ అభ్యర్థి, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకు సార్వత్రిక ఎన్నికల ముందు భారీ షాక్ తగిలింది. బీఆర్ఎస్ కాటారం సబ్ డివిజన్ యూత్ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్, కాటారం బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు సుజాత మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు సమక్షంలో 50 మందితో కలిసి గాంధీభవన్‌లో కాంగ్రెస్ లో చేరారు. పది సంవత్సరాలుగా బీఆర్ఎస్‌లో పనిచేస్తూ పుట్ట మధుకు నమ్మిన బంటుగా వ్యవహరిస్తూ బీఆర్ఎస్ పటిష్టతకు పనిచేసిన నాయని శ్రీనివాస్ బీఆర్ఎస్ కు రాజీనామా చేయడం భారీ నష్టమని చెప్పొచ్చు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్ టీడీపీలో రాజకీయ ఓనమాలు నేర్చుకొని సామాన్య కార్యకర్తగా అంచెలంచెలుగా ఎదుగుతూ మంథని నియోజకవర్గంలో పట్టున్న యువజన నాయకుడిగా పేరు సంపాదించుకున్నారు. కాటారం ఉప సర్పంచ్ గా పనిచేస్తున్న శ్రీనివాస్ గ్రామపంచాయతీ అభివద్ధికి అహర్నిశలు కషి చేస్తున్నాడు. ఈ కార్యక్రమం మండల అధ్యక్షులు వేము నూరి ప్రభాకర్ రెడ్డి , ఎంపీపీ పంతకానీ సమ్మయ్య, టీపీసీసీ మహిళ ప్రధాన కార్యదర్శి సుగుణ, డిసిసి మహిళా ప్రధాన కార్యదర్శి కుంభం స్వప్న రెడ్డి, కాటారం మండలం మహిళా –అధ్యక్షురాలు జాడి మహేశ్వరి రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చీమల సందీప్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులుగా శంకర్ నియామకం

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

ఏఐసీసీ కార్యదర్శి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు యువనేత శ్రీను బాబుల ఆదేశాల మేరకు భూపాల పల్లి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దండు రమేష్ మంథని నియోజకవర్గ ఎస్సీ సెల్ అద్యక్షులు మంథని సత్యం ఆదేశాల మేరకు మంథని నియోజకవర్గంలోని మహదేవ్‌పూర్ మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులుగా గారే శంకర్‌ను నియమించడం జరిగింది. ఈ నియామకం బుధవారం నుండి అమలులోకి రానుంది. పార్టీ బలోపేతం చేసే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహదేపూర్ మండల్ ప్రెసిడెంట్ అక్బర్ ఖాన్ మండల్ ప్రధాన కార్యదర్శి చెకుర్తి శంకరయ్య, మద్దులపల్లి గ్రామశాఖ అద్యక్షులు బాపు రెడ్డి, పల్గుల గ్రామ శాఖ అద్యక్షులు మనెం మహేష్, పల్గుల యూత్ అద్యక్షులు సంతోష్ పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై దాడులు

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మహదేవ్ పూర్ మండలంలోని సూరారం మహదేవ్ పూర్ గ్రామాల్లోనో బెల్ట్ షాపులలో .బుధవారం పోలీసులు తనిఖీలు చేసి మహదేవ్ పూర్ లో 33 బీర్లు, సూరారం గ్రామంలో 31 బీర్లు స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు.

వాహనాల తనిఖీ



నవతెలంగాణ-మంగపేట

మండలంలోని కమలాపురం గ్రామంలో ఎస్సై గోదరి రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఏటూరునాగారం నుంచి మణుగూరు వైపు మణుగూరు నుంచి ఏటూరు నాగారం వైపు వచ్చి వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. సాధారణ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో తనిఖీలను ముమ్మరం చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

షాట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



నవతెలంగాణ-మహదేవ్‌పూర్

షాట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైన సంఘటన మహాదేవపూర్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి మండలకేంద్రంలో గడి హనుమాన్ వాడలో కొట్టవడ్ల సత్యనారాయణ గత కొన్ని సంవ్సరాలుగా వడ్రంగి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.సోమ మంగళ సాయంకాలం కోతుల గుంపు అకస్మాత్తుగా భీభత్సం సృష్టిస్తూ కరెంటు పోల్ వైర్లను తెంపడంతో మంటలు అంటుకున్నాయి దీంతో ఇంటికి అంటుకున్న మంటలతో ఇల్లు దగ్ధమైంది ఇంట్లోని పని ముట్లతో పాటు పని చేసే యంత్రాలు పూర్తిగా దగ్ధమయ్యాయి.దీంతో సుమారు రూ.మూడు లక్షల యాభై వేల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు సత్యనారాయణ ఆవేదన వ్యక్తంచేశారు.ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. .



మృతుని కుటుంబాన్ని పరామర్శంచిన నాగజ్యోతి

నవతెలంగాణ-తాడ్వాయి

ములుగు జిల్లా జడ్పి చైర్ పర్సన్, బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి బుధవారం మండలంలోని కాల్వపల్లి గ్రామంలో అకాల మరణం చెందిన సిద్దబోయిన సమ్మక్క భౌతికకాయానికి పూల మాల వేసి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు, వారి కుటుంబ సభ్యులకు అండగా వుంటానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు దండుగుల మల్లయ్య, ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య, గ్రామ అధ్యక్షులు పీరీల నరేష్, ఉప సర్పంచ్ ఆలేటి ఇంద్ర సేన రెడ్డి, మాజీ జడ్పీటీసీ సిద్దబోయిన వసంతరావు, బండారి చందయ్య,సీనియర్ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు జయశంకర్ ఫౌండేషన్ చేయూత

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి చేపట్టిన నిరుపేద విద్యార్థులు చదువు మధ్యలో ఆపిన వారికి ఓపెన్ టెన్త్ పరీక్ష ఫీజులు కట్టుడు ప్రక్రియ మంచి స్పందన రావడంతో రెండవ రోజు కూడ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. ఈసందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ చదువుదామని ఉన్న పరీక్ష ఫీజు కట్టలేని పరిస్థితిలో తాము ఉన్నామని పనికి వెళ్తే గాని ఇల్లు గడవని పరిస్థితి ఉందన్నారు. తమ కోసం మంచి కార్యక్రమాన్ని చేపట్టిన జయశంకర్ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ యూత్ ఇన్‌ఛార్జ్ చింతకింది రాజు, నేనెలా కార్తీక్, చిర్ర శ్రీనివాస్, అలాగే ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.





తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

జీకే తండా నుండి బీజేపీలో భారీగా చేరికలు

జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఒద్దిరాజు రాంచందర్ రావు



నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

తెలంగాణ అభివృద్ధి బిజెపితోనే సాధ్యమని బిజెపి జిల్లా అధ్యక్షుడు బుద్దిరాజు రామచంద్రరావు అన్నారు. మండలంలోని అమ్మాపురం శివారు జీకే తండాకు చెందిన సుమారు 200 మంది కార్యకర్తలు బుధవారం బిజెపి పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగా రామ్మోహన్ రెడ్డితో కలిసి బిజెపి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. కెసి ఆర్ గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మళ్లీ ఓట్ల కోసం కొత్త హామీలను అమలు చేస్తానని అనడం సిగ్గుచేటు అన్నారు. అజ్మీర అశోక్, గుగులోతు మాలిక్, అజ్మీర నవీన్, అజ్మీరా కిషన్, బానోత్ శివ, బానోత్ శంకర్, లకావత్ బాలాజీ, గుగులోత్ యాకుబ్ గుగులోతు మహేష్, సురేష్, తరుణ్, ప్రవీణ్, కిరణ్, గణేష్, శ్రీను, సికిందర్, సుమన్‌లతో పలువురు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా కార్యదర్శి రచ్చ కుమార్, ఎస్టీ మోర్చా పార్లమెంట్ కన్వీనర్ అలిసేరి రవిబాబు, జిల్లా అధికార ప్రతినిధి చింతా సజన్, బిజెపి తొర్రూరు రూరల్ మండల అధ్యక్షుడు బొచ్చు సురేష్,అర్బన్, పెద్దవంగర, దేవరుప్పుల మండలాల అధ్యక్షులు పల్లె కుమార్, బి.సుధాకర్,భాగల నవీన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు కొండ యాక య్య, బొల్లం సాయి, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు గుగులోతు సురేష్ రవితేజ, యాకన్న, విష్ణు వర్ధన్, అశోక్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సమగ్రాభివృద్ధికి మోడీ చేయూత

బీజేపీ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ర.శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-తొర్రూరు



ప్రదాని నరేంద్ర మోడీ తెలంగాణ సమగ్రాభివృద్ధికి చేయూత అందించారని బీజేపీ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి, పాలకుర్తి నియోజకవర్గ ఆస్పిరెంట్ క్యాండీడేట్ కర్ర శ్రీనివాస్ రెడ్డి (కేఎస్ఆర్) తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోడీ తెలంగాణకు జాతీయ పసుపు బోర్డు, సమ్మక్క సారక్కల పేరుమీదుగా గిరిజన యూనివర్సిటీ ప్రకటించిన తరువాత రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్ అమాంతం పెరిగిపోయిందని, తెలంగాణ ప్రజలకు మోడీపై, బీజేపీ పట్ల అపారమైన నమ్మకం, విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కేసిఆర్ సర్కారు అవినీతి, కుటుంబ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోందని, ఈఎన్నికల్లో కల్వకుంట్ల కుటుంబ పాలన అంతం కావడం ఖాయం అని జోస్యం చెప్పారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఎర్రబెల్లి దయాకర్ రావు గెలవడం కోసమే విలువలకు తిలోదకాలు ఇచ్చి లక్షల రూపాయలు ఎరజూపి ప్రతిపక్ష నేతలను సంతలో పశువులను కొన్నట్లు కొంటున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి,15వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ కొలుపుల శంకర్, ఎస్సీ మోర్చా అర్బన్ అధ్యక్షుడు మంగళపల్లి యాకయ్య, అర్బన్ ఉపాధ్యక్షుడు నడిగడ్డ ఉపేంధర్, అర్బన్ కార్యదర్శి జలగం రవి, బీజేవైఎం అర్బన్ ప్రధాన కార్యదర్శి నూకల నవీన్, సోషల్ మీడియా కన్వీనర్ కుమ్మరి కుంట్ల శివ, మండల నాయకులు పప్పుశెట్టి సంతోష్, భాస్కరాచారి, దేవరకొండ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం

నవతెలంగాణ-బయ్యారం



మండల పరిధిలోని ఇసుకమేది గ్రామంలో గడప గడపకూ కాంగ్రెస్ ప్రచార కార్యక్రమం బుధవారం ఎంపీటీసీ సనప సోమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగున్నర ఏండ్లలో ఒక్క డబుల్ బెడ్ రూం, రేషన్ కార్డు ఇవ్వలేని చేతకాని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పాతరేసుడేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టగానే అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు పటిష్టంగా అమలు చేస్తామన్నారు. రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి స్థలంతో పాటుగా, ఐదు లక్షల రూపాయలు కేటాయింపు, రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా పథకం ద్వారా పది లక్షల రూపాయలతో మెరుగైన వైద్య సేవలు, చేయూత పథకం ద్వారా ఒంటరి మహిళకు ప్రతీనెలా నాలుగువేల రూపాయల ఫించన్, గృహజ్యోతి పథకం ద్వారా ప్రతీ కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతీనెలా 2,500 రూపాయలు, రైతు బరోసా పథకం ద్వారా రైతులతో పాటుగా కౌలు రైతులకు ప్రతియేటా 15,000 రూపాయలతో పాటుగా వరిపంటకు 500 రూపాయల బోనస్ అందజేయనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కృష్ణ, మాజీ ఉప సర్పంచ్ స్వామి, వార్డు మెంబర్ సనప భద్రమ్మ, ఇర్ప రాధ, గ్రామ పటేల్ పరయ్య, ముఖ్య నాయకులు సనప రమేష్, పద్మారావు సంపత్, యారయ్య, సబశివరావు, రాకేష్, కృష్ణ, రవీందర్ పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపరాదు : ఎస్ఐ

నవతెలంగాణ-తొర్రూరు



వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్ఐ రాంజీ నాయక్ అన్నారు. బుధవారం రాత్రి తొర్రూరు బస్టాండ్ సెంటర్లో వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తి పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇక బ్యాలెట్ పోరు..!

- టికెట్ల ఖరారుతో టీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రచారం
- కాంగ్రెస్, బీజేపీ ఆశావాల్లో టికెట్ల ఉత్కంఠ

నవతెలంగాణ-తొర్రూరు

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం మరో నాలుగు రాష్ట్రాలతో కలిపి షెడ్యూల్ ప్రకటించింది. దీంతో తక్షణమే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింది. పోలింగ్‌కు కౌంట్ డౌన్ షురువైంది. నవంబర్ 10 వరకు నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కావడంతో ఆయా పార్టీలు ఒక్కసారిగా అలర్ట్ అయ్యాయి. జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలో ఇప్పటికే టికెట్ ఖరారైన అధికార పార్టీ పాలకుర్తి నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇప్పటివరకు ప్రొసీడింగులు, శంకుస్థాపనలు చేయడంతో బిజీబిజీగా గడిపారు. మరోవైపు ఎన్నికల ప్రచారం సైతం చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో కోడ్ అమల్లోకి రావడంతో అలర్ట్ అయ్యారు.

కొలిక్కిరాని కాంగ్రెస్, బీజేపీ టికెట్లు...

పాలకుర్తి నియోజకవర్గంలో ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బిజెపిల్లో టికెట్టు ఖరారు కొలిక్కి రాకపోవడంతో ఆయా పార్టీల ఆశావాహులు, కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొంది. రెండు జాతీయ పార్టీలు కావడంతో ఢిల్లీ స్థాయి వరకు ఆశావాహులు తమ లాభీయింగ్ చేసుకుంటూ వచ్చారు. మరోవైపు పార్టీల నాయకులు సర్వేలను ప్రామాణికంగా తీసుకోవడంతో పాటు, రచ్చద్దుల బలబలాలను సైతం వేరీజు వేసుకుంటున్నారు. రెండు పార్టీల విషయమై జాతీయ నాయకత్వాలు పకడ్బందీగా వ్యవహరిస్తుండడంతో రాష్ట్ర నాయకత్వాలు సైతం పూర్తిస్థాయిలో ఆశావాహులకు భరోసా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నారై తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన హనుమాన్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి, మరో ఎన్నారై మహబూబాబాద్ మండలం ఆమనగల్ గ్రామానికి చెందిన ఏ.తిరుపతిరెడ్డి టికెట్ కోసం పోటీ పడుతున్నారు. ఇదిలా ఉండగా బిజెపి పార్టీలో పాలకుర్తి టికెట్ కోసం నలుగురు నేతలు పోటీ పడుతున్నారు. తొర్రూర్‌కు చెందిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదగాని సోమయ్య, దేవరుప్పుల మండలం నిర్మల గ్రామానికి చెందిన లేగల రామ్మోహన్ రెడ్డి, వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన బిజెపి రాష్ట్ర నాయకులు పాకనాటి దామోదర్ రెడ్డి, రాయపర్తి మండలం కొండూరు గ్రామానికి చెందిన కర్ర శ్రీనివాస్ రెడ్డిలు టికెట్ ఆశిస్తున్న వారిలో పోటీ పడుతున్నట్లు సమాచారం.



మట్టి రోడ్లను తలపిస్తున్న సీసీ రోడ్లు

నీళ్లు లేక ఎండిపోతున్న వైనం

నవతెలంగాణ-మరిపెడ

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయి పాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల కాలంలో పోసిన సీసీ రోడ్లు నిర్మించగా నీళ్లు పోసే దిక్కు లేక మట్టి రోడ్లను తలపిస్తున్న వైనం నెలకుంది. ఎస్‌డిఎఫ్ నిధుల నుండి 42 లక్షలు, సిడిఎఫ్ నిధుల నుండి 5 లక్షలు, మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుండి 5లక్షలు మొత్తం సుమారు 52 లక్షల నిధులతో అంతర్గత సిసి రోడ్లు, డ్రైనేజీ, వరద కాలువ పనులకు జూన్ నెలలో ఎమ్మెల్యే రెడ్యానాయక్ శంకుస్థాపనలు చేయగా, ఈ పనులను ఇటీవల కాలంలో స్థానిక సర్పంచ్ ఆర్భాటంగా ప్రారంభించారు. అయితే ఈ రోడ్డు పోసిందే గుత్తా సిసి రోడ్డుపై నీళ్లతో క్యూరింగ్ చెయ్యకపోవడంతో సిసి రోడ్డు మట్టి రోడ్లతో దర్శనమిస్తున్నాయని ఆ ప్రాంతానికి చెందిన కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల కోసం ప్రభుత్వం నిధులనుండి లక్షల ఖర్చు చేస్తున్న రాజకీయ నాయకులు కాంట్రాక్టర్ల అవతారమెత్తి నాసిరకమైన రోడ్లను పోస్తున్నారని దీంతో నాణ్యత లోపించిన రోడ్లు దెబ్బ తినే ప్రమాదం ఉందని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిర్మాణ పనులపై అధికారులు నిఘా ఉంచాలని పలువురు కోరుతున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన సంకు సత్తిరెడ్డి

నవతెలంగాణ-బయ్యారం



ఇల్లందు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు బుధవారం మండల బిఆర్ఎస్‌పార్టీ మండల అధికార ప్రతినిధి సంకు సత్తిరెడ్డి కొన్ని కారణాల వలన బీఆర్ఎస్ పార్టీకి గతంలో రాజీనామా చేశారు. మరల ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ వారిని తిరిగి పార్టీలో పని చేయమని మండలంలో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. దీంతో మండల పార్టీ అధికార ప్రతినిధితో పాటు మరికొన్ని బాధ్యతలు ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు.

భారీగా తగ్గిన వంట నూనె ధరలు

నవతెలంగాణ-నరసింహులపేట

వంట నూనె ధరలు భారీగా తగ్గాయి. సామాన్యులకు నిజంగా ఇది ఊరట కలిగించే విషయమని చెప్పుకోవచ్చు. రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్, రిఫైన్డ్ సోయాబీన్ ఆయిల్, రిఫైన్డ్ పామోలిన్ ఆయిల్ ధరలు ఇంతక ముందు కంటే భారీగా తగ్గాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దీంతో వంట నూనె కొనుగోలు దారులకు గొప్ప శుభ వార్త. సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర 29 శాతం తగ్గగా, అలాగే సోయాబీన్ ఆయిల్ ధర 19 శాతం తగ్గింది. ఇక పామోలిన్ ఆయిల్ ధర 25 శాతం తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్లో వంట రూనె ధరలు భారీగా తగ్గడంతో దేశంలో కూడా ఆయిల్ ధరలు భారీగా దిగి వచ్చాయని చెప్పుకోవచ్చు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

నవతెలంగాణ-తొర్రూరు

తొర్రూరు పట్టణ కేంద్రంలోని శాఖ గ్రంథాలయానికి పట్టణానికి చెందిన ఓలేటి యాదగిరి ఆచార్యులు పదివేల రూపాయల విలువ గల పుస్తకాలను మాజీ ఎంపీటీసీ, సామాజిక సంఘ కార్యకర్త ధారావత్ సోమన్న ఆధ్వర్యంలో బుధవారం ఇంజనీరింగ్ ఎంసెట్ గ్రూపు-1,2,4 పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సోమన్న, యాదగిరి చార్యులు మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవటానికి గ్రంథాలయాలు తోడ్పాటును అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయాల అధికారి జాటోతు శంకర్ నాయక్, పాఠకులు మహమ్మద్ అమీర్, గుమ్మడవెల్లి పురుషోత్తం, బొమ్మర బోయిన వెంకన్న యాదవ్, ధారావత్ సోమన్న, అంజయ్య, వెంకన్న, భూసాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి

నవతెలంగాణ-మరిపెడ

అక్టోబర్ 8,9,10వ తేదీలలో కేరళ అలెప్పిలో జరిగిన హుసేన్ ఖాన్ 6వ జాతీయస్థాయి ఫోటోగ్రఫీ వర్క్యుషాప్‌లో వివిధ రాష్టల నుంచి 35 మంది ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఈ వర్క్యుషాప్ ప్రముఖ ఫోటోగ్రాఫర్, ఫ్యాకల్టీ ఖమ్మంకు చెందిన హుసేన్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేరళ సంప్రదాయ కళలైన కథాకళి, తెయ్యం, కడియారపట్టు, ట్రావెలింగ్ అంశాలపై జరిగింది. ఫోటోవర్క్ షాప్ అనంతరం అలెప్పిలో జరిగిన స్పాట్ కాంపిటీషన్‌లో ద్వితీయ బహుమతిని మరిపెడకు చెందిన షేక్ ఫక్రుద్దీన్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మొయినోద్దీన్, మండలోజు శ్రీనివాస్, ఎలుగోటి వెంకట్,తూర్పాటి సత్యనారాయణ, ఇరుకుల్ల వీరేశం, సూర్యప్రకాష్, కొమ్మోరి శ్రీనివాస్, శ్రావణ్, శ్రీహరి, పవన్, కళ్యాణ్, అశోక్, రాజయ్య, ఫోటోగ్రఫీ మిత్రులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి వెంకన్న నాయక్ ఘన నివాళి

నవతెలంగాణ-మరిపెడ

మరిపెడ మండలం తండ ధర్మారం గ్రామానికి చెందిన నిజం దిన పత్రిక స్టేట్ బ్యూరో గూగులోత్ శ్రీనివాస్ నాయక్ తండ్రి రిటైర్డ్ ఉద్యోగి గుగులోతు వెంకన్న నాయక్ ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం ఆయన దశదినకర్మ కు స్థానిక శాసనసభ్యులు రెడ్యానాయక్, ఎంపీపీ గూగుల్ లోతు అరుణ రాంబాబు, జడ్పిటిసి శారద రవీందర్, మున్సిపల్ చైర్ పర్సన్ సింధూర, కాంగ్రెస్ పార్టీ డోర్నకల్ నియోజకవర్గ ఇన్చార్జి జాటోత్ రామచంద్రనాయక్ దంపతులు, మాజీ ఎంపీపీ జి వెంకన్న, గ్రామ సర్పంచ్ గూగులోత్ లక్ష్మీ లకుపతి, టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి జిన్నా లచ్చన్న, రిటైడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు సీతారాం, జిల్లా అధ్యక్షులు గాదె అశోక్ రెడ్డి, వీరయ్య, పలువురు ప్రముఖులు వెంకన్నకు ఘన నివాళులర్పించారు.

విడుదలకు అర్హులైన ఖైదీలను గుర్తించండి

జిల్లా జడ్జి చంద్రశేఖర్ ప్రసాద్

నవతెలంగాణ-మహబూబాబాద్

జిల్లాలో ఎక్కువ కాలం జైలులో ఉన్న ఖైదీల విడుదలకు అర్హులైన ఖైదీలను గుర్తించాలని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి చంద్రశేఖర ప్రసాద్ సూచించారు. బుధవారం జిల్లా కోర్టుల సముదాయంలో జిల్లా జడ్జి చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ జిల్లా జడ్జి చంద్రశేఖర్ ప్రసాద్ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ కె.శశాంక, జిల్లా ఎస్పీ జి.చంద్రమోహన్, సురేష్ సెక్రటరీ డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ,సబ్ జైల్ సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాస్ సభ్యులుగా అండర్ ట్రయల్ ప్రిసనర్స్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎక్కువ కాలం జైలులో ఉన్న ఖైదీలలో విడుదలకు అర్హులైన వారి కేసులు విచారించి తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, క్రైమ్ బ్యూరో సి.ఐ.సి.హెచ్ శ్రీనివాస్, లైజన్ అధికారి ఎస్.ఐ వెంకటాచారి పాల్గొన్నారు.